గొర్రెల కాపరుల మధ్య కొట్లాటలో ఒకరి మృతి

కశింకోట, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉగ్గినపాలెంలో ఆదివారం రాత్రి గొర్రెల కాపరుల మధ్య జరిగిన కొట్లాటలో ఒకరు మృతిచెందారు. ఈ సంఘటనకు సంబంధించి స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పక్కుర్తి అప్పలనాయుడు(65), ఒమ్మి నూక రాజు, ఒమ్మి శ్రీనుల మధ్య గొర్రెల పెంపకం విషయమై ఆదివారం మధ్యాహ్నం పొలంలో గొడవ జరిగింది. రాత్రి ఇంటికి వచ్చిన తరువాత మరోసారి గొడవపడి కర్రలతో పరస్పరం దాడి చేసుకున్నారు. అప్పలనాయుడుకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు.

నరక ప్రయాణం

అనకాపల్లి- చోడవరం రోడ్డులో పలుచోట్ల భారీ గోతులు

- తుమ్మపాలలో మూడు కి.మీ.ల మేర ఛిద్రమైన రహదారి
- మార్టూరు జంక్షన్, దర్జీనగర్, ఊడేరు, మామిడిపాలెం, ముద్దుర్తి వద్ద ఇదే పరిస్థితి
- వర్షం కురిస్తే చెరువులను తలపిస్తున్న గోతులు
- రాత్రిపూట ప్రమాదాలబారిన ద్విచక్ర వాహనదారులు


తుమ్మపాల చినబాబుకాలనీ వద్ద గోతుల్లో వర్షం నీరు నిలిచి చెరువును తలపిస్తున్న మెయిన్ రోడ్డు

తుమ్మపాల (అనకాపల్లి), మే 18 (ఆంధ్రజ్యోతి):

అనకాపల్లి నుంచి చోడవరం వైపు వెళ్లే ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారి తుమ్మపాల నుంచి వెంకన్నపాలెం వరకు భారీ గోతులు ఏర్పడి అత్యంత దారుణంగా తయారైంది. కొన్నిచోట్ల తారుతోపాటు రాళ్లు, పిక్కలు లేచిపోయి రోడ్డు మొత్తం ధ్వంసం అయ్యింది. కొద్దిపాటి వర్షం కురిసినా.. గోతుల్లో నీరు చేరి వాహనదారులకు ప్రమాదకరంగా మారాయి. ఏది రోడ్డో? ఏది గోయ్యో? తెలియక ఇబ్బంది పడుతున్నారు. రాత్రిపూట దగ్గరకు వచ్చే వరకు గోతులు కనిపించకపోవడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.


గుండాల జంక్షన్ వద్ద ప్రమాదకరంగా తయారైన గోతులు

అనకాపల్లి కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పడిన తరువాత అనకాపల్లి- చోడవరం రహదారికి ప్రాధాన్యం పెరిగింది. మాడుగుల, చోడవరం అసెంబ్లీ నియోజకవర్గాల ప్రజలు అనకాపల్లిలోని వివిధ జిల్లాస్థాయి కార్యాలయాల్లో పనుల కోసం వచ్చిపోతుంటారు. ఇంకా అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పలు మండలాల ప్రజలు జాతీయ రహదారికి చేరుకోవాలంటే ఈ మార్గంలో నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. అనకాపల్లి మండలంలోని పలు గ్రామాల్లో రాయి క్వారీలు, క్రషర్లు వున్నాయి. వీటి నుంచి పిక్క, రాయి, క్రషర్ డస్ట్ వంటివి ఈ రోడ్డు గుండానే రవాణా అవుతుంటాయి. ఇంకా మాడుగుల, రావికమతం, రోలుగుంట మండలాల్లో వున్న గ్రానైట్ క్వారీల నుంచి భారీ బండరాళ్లను ఈ మార్గంలోనే తరలిస్తుంటారు. దీంతో అనకాపల్లి- చోడవరం మార్గంలో వాహనాల రద్దీ గణనీయం పెరిగింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క ఏడాది కూడా నిర్వహణ పనులు చేయకపోవడంతో రహదారిపై అడుగడుగునా గోతులు ఏర్పడ్డాయి. ఇవి క్రమేపీ పెద్దవై.. రోడ్డు మొత్తం విస్తరించి, కొన్నిచోట్ల తారు రోడ్డు ఆనవాళ్లు కనిపించడంలేదు. ముఖ్యంగా అనకాపల్లి పట్టణం వైపు గుండాల ... మిగతా 6వ పేజీలో

ఛిద్రమైన రోడ్డుతో అవస్థలు


జె.అప్పలరాజు


చదరం నగేశ్

తుమ్మపాల మెయిన్‌రోడ్డు గోతులతో దారుణంగా తయారైంది. వివిధ పనుల మీద అనకాపల్లి వెళ్లి రావడానికి నానా అవస్థలు పడుతున్నాం. వర్షం కురిస్తే గోతుల్లో నీరు చేరి ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కుటుంబంతో ద్విచక్ర వాహనం మీద వెళ్లాలంటే భయపడాల్సి వస్తున్నది. రోడ్డు సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది.


తుమ్మపాలలో యూనియన్ బ్యాంకు వద్ద రోడ్డు మొత్తం ఛిద్రమైన దృశ్యం

బదిలీల హడావిడి

రెవెన్యూ శాఖలో పలువురు తహసీల్దార్లకు స్థానచలనం తప్పదా?

- ఏజెన్సీ నుంచి విశాఖకు పలువురి రాక
- ట్రెజరీ విభాగంలో ఏళ్ల తరబడి తిష్ఠ వేసిన కొందరు ఉద్యోగులు
- జూన్ 2వ తేదీలోగా ముగియనున్న ప్రక్రియ



విశాఖపట్నం, మే 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల సాధారణ బదిలీలపై నిషేధాన్ని తాత్కాలికంగా ఎత్తివేశారు. ఈ నెల 16 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు బదిలీల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతించడంతో జిల్లాలో పలు ప్రభుత్వశాఖల్లో బదిలీల హడావిడి మొదలైంది. ఈ ఏడాది మే 31 నాటికి ఒకేచోట ఐదేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న ఉద్యోగులను తప్పనిసరిగా బదిలీ చేయాలన్న ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అన్ని శాఖల్లో ఉన్న అటువంటి ఉద్యోగులను గుర్తించే పనిలో ఉన్నతాధికారులు నిమగ్నమయ్యారు. జిల్లాల విభజన తరువాత అన్ని శాఖల్లో కొందరు ఉద్యోగులకు స్థానచలనం జరిగింది. ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన బదిలీలు నిర్వహించడంతో 2022 ఏప్రిల్ నాటికి మిగిలిన ఉద్యోగుల్లో ఐదేళ్ల సర్వీసు పూర్తిచేసిన వారికి బదిలీలు అనివార్యమని స్పష్టమైంది. ఈ నేపథ్యంలో అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల్లో ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసిన ఉద్యోగులు విశాఖ జిల్లాకు రావడానికి అవకాశం ఏర్పడింది. నోడల్ జిల్లాగా ఉండడంతో విశాఖ కలెక్టర్ ఆధ్వర్యంలోనే బదిలీలు జరగనున్నాయి. దీంతో ఆయా జిల్లాల్లో బదిలీలు కోరుకునే ఉద్యోగుల వివరాలను పంపాలని అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల కలెక్టర్లకు ఆయన లేఖలు రాయనున్నారు.

రెవెన్యూ శాఖలో బదిలీలకు భారీ కసరత్తు

రెవెన్యూ శాఖలో బదిలీల కోసం భారీ కసరత్తు జరిగే అవకాశం ఉంది. ఏజెన్సీలో ఐదేళ్ల సర్వీసు పూర్తిచేసి 55 ఏళ్ల దాటిన ఉద్యోగులు విశాఖ లేదా అనకాపల్లి జిల్లాకు రావడానికి నిర్ణయించుకున్నారు. గత ఏడాది బదిలీల్లో విశాఖ జిల్లాకు రావడానికి దరఖాస్తు చేసిన ముగ్గురు తహసీల్దార్లను అల్లూరి సీతారామరాజు జిల్లా యంత్రాంగం రిలీవ్ చేయలేదు. మైదాన ప్రాంతం నుంచి ఏజెన్సీకి వెళ్లేందుకు కొందరు విముఖత చూపడంతో ఈ ముగ్గురు తహసీల్దార్లు పాడేరు డివిజన్‌లోనే పనిచేస్తున్నారు. జిల్లాల విభజన సమయంలో జూనియర్లను పాడేరు జిల్లాకు పంపడంలో అప్పటి అధికారులు చేసిన పొరపాట్లను ప్రస్తుత అధికారులు సవరించాలని పలువురు కోరుతున్నారు. కాగా విశాఖ జిల్లాలో పనిచేస్తున్న కొద్ది మంది తహసీల్దార్లకు బదిలీ తప్పదని రెవెన్యూ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. గత ఏడాది కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏరికోరి మండలాలకు పోస్టింగ్స్ కోసం సిఫారసు చేసిన ఎమ్మెల్యేలు ఇప్పుడు వారి విషయంలో విభేదిస్తున్నారు. ఇద్దరు ముగ్గురు తహసీల్దార్లు జిల్లా యంత్రాంగం అంచనాలకు భిన్నంగా పనిచేయడం లేదని, భూ లావాదేవీల్లో ఆరోపణలు చుట్టుముట్టడంతో వారికి బదిలీలు తప్పవని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

అదేవిధంగా పౌరసరఫరాలశాఖలో పలువురు అధికారులు, చెకింగ్ ఇన్‌స్పెక్టర్లకు బదిలీలు జరుగుతాయని పలువురు పేర్కొంటున్నారు. ఏఎస్‌వో కేడర్ అధికారి ఒకరు డీలర్ల సంఘ నేత ద్వారా సొంతంగా రేషన్ డిపోలను నిర్వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఉమ్మడి జిల్లాలో టీడీపీ సీనియర్ నేత మనిషినంటూ జిల్లా అధికారులను లెక్కచేయడం లేదనే వాదన వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో సదరు ఏఎస్‌వోపై బదిలీ వేటు పడవచ్చని ప్రచారం జరుగుతోంది.

విశాఖ ఖజానా శాఖలో ఏళ్ల తరబడి పలువురు తిష్ఠ

విశాఖ జిల్లా ఖజానాశాఖ కార్యాలయంలో పలువురు ఉద్యోగులు ఏళ్ల తరబడి కొనసాగుతున్నారు. వీరిలో పలువురిపై పలు రకాల ఆరోపణలున్నాయి. ఓ ఉద్యోగి 15 ఏళ్లుగా ఇక్కడే తిష్ఠ వేశారు. అటెండరుగా చేరిన ఉద్యోగి ఒకరు జూనియర్ అకౌంటెంట్‌గా, ఆ తరువాత సీనియర్ అకౌంటెంట్‌గా పదోన్నతి పొంది ఇక్కడే పని చేస్తున్నారు. అలాగే సర్వీస్ కమిషన్ ద్వారా రిక్రూట్ అయిన ఉద్యోగులు కొందరు మధ్యలో అనకాపల్లి జిల్లాకు వెళ్లి ఏడాదిలో తిరిగి విశాఖ వచ్చి ఇక్కడే కొనసాగుతున్నారు.

ఉపాధ్యాయుల బదిలీలకు మార్గం సుగమం

జిల్లా విద్యాశాఖలో ఉపాధ్యాయుల బదిలీలకు దాదాపు మార్గం సుగమం అయింది. ఇందుకు సంబంధించి ఒకటి రెండు రోజుల్లో షెడ్యూల్ వెలువడనున్నది. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన జరిగే బదిలీల కోసం విద్యాశాఖ జాబితా రూపొందించింది. ఒకేచోట ఐదేళ్లు/ఎనిమిదేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న ఉపాధ్యాయులు సుమారు 2,300 మంది వరకు ఉంటారని అంచనా వేశారు. ఇంకా మరో రెండు వేల మంది వరకు బదిలీలు జరుగుతాయని అంటున్నారు. ఉమ్మడి జిల్లా మొత్తంగా ఐదు వేల మంది టీచర్లకు బదిలీలు జరుగుతాయని ఉపాధ్యాయ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. దాదాపు ఎనిమిదేళ్ల తరువాత ఈ పర్యాయం భారీగా బదిలీలు జరుగుతాయని అంచనా వేస్తున్నారు.

మత్స్యకారుల వలలో భారీ చేపలు

ఒక్కోటి ఎనిమిది కిలోల పైబడి బరువు

- కిలో రూ.200 రేటుకు అమ్మకం




వలకు చిక్కిన భారీ చేపలతో మత్స్యకారులు కనక, సంజీవ్

దేవరాపల్లి, మే 18 (ఆంధ్రజ్యోతి): చాలా కాలం తరువాత రైవాడ జలాశయంలో మత్స్యకారులకు భారీ చేపలు చిక్కాయి. సాధారణంగా రెండు, మూడు కిలోల బరువున్న చేపలు వలలో పడుతుంటాయి. అయితే ఆదివారం వేటకు వెళ్లిన మత్స్యకారుల్లో సంజీవ్, కనక అనే ఇద్దరికి సుమారు ఎనిమిది కిలోల బరువున్న రెండు చేపలు వలకు చిక్కాయి. వీటిని ఒడ్డుకు తీసుకురాగా.. అప్పటికే వేచివున్న కొనుగోలుదారులు వాటిని దక్కించుకోవడానికి పోటీ పడ్డారు. కిలో రూ.200 చొప్పున ఒక్కో చేపను రూ.1,600లకు కొనుగోలు చేశారు. ఇంత భారీ చేపలు చాలా అరుదుగా లభిస్తుంటాయని మత్స్యకారులు చెప్పారు.

నూకాంబిక ఆలయానికి పెరిగిన భక్తుల రాక


బాలాలయంలో నూకాంబిక అమ్మవారు

అనకాపల్లి నూకాంబిక అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తుల రద్దీగా పెరిగింది. అమ్మవారి కొత్త అమావాస్య జాతర ముగిసి మూడు వారాలు అయినప్పటికీ భక్తుల తాకిడి తగ్గలేదు. ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి అమ్మవారి దర్శనం కోసం భక్తులు భారీగా తరలివచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయం ప్రాంగణం కిటకిటలాడింది. బాలాలయంతో పాటు క్యూలైన్లు అన్ని భక్తులతో నిండిపోయాయి.

- అనకాపల్లి టౌన్/ ఆంధ్రజ్యోతి


క్యూ లైన్లలో భక్తులు

మెడికల్ సర్టిఫికెట్ల మాయాజాలం!

గతంలో జారీ చేసిన ధ్రువపత్రాలపై అనుమానాలు

- బోర్డు ఎదుట 442 మంది ఉపాధ్యాయులు హాజరు
- సగం మందికి 56 శాతానికి పైగా వైకల్యం లేదని నిర్ధారణ
- 160 మంది వరకు మెడికల్ బోర్డు ఎదుట హాజరు కాని వైనం



విశాఖపట్నం, మే 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీల్లో కీలకమైన ప్రాధాన్యత పాయింట్ల కేటాయింపునకు సంబంధించి మెడికల్ సర్టిఫికెట్ల జారీ వ్యవహారంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సర్టిఫికెట్ల కోసం మెడికల్ బోర్డు ఎదుట హాజరైన వారిలో సగం మందికి 56 శాతం కంటే తక్కువ శాతం వైకల్యం ఉండడంతో వారు ప్రాధాన్యత కేటగిరీలోకి రారని వైద్యులు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో గతంలో మెడికల్ బోర్డులు సర్టిఫికెట్లు జారీ చేసిన సమయంలో అవకతవకలు జరిగాయనే వాదన వినిపిస్తోంది. దీనికి అనుగుణంగా సుమారు 160 మంది వరకు బోర్డు ఎదుట హాజరు కాకపోవడంతో అనుమానాలకు మరింత బలం చేకూరింది. ఉపాధ్యాయుల బదిలీల సమయంలో ప్రాధాన్యత పాయింట్లు ఇవ్వడం ఆనవాయితీ. ఎక్కువ ప్రాధాన్యత పాయింట్లు ఉన్నవారంతా విశాఖ నగరం, పరిసరాలు, అనకాపల్లి చుట్టుపక్కల ఉన్న పాఠశాలల్లో పనిచేస్తున్నారు. తాజాగా జరగనున్న టీచర్ల బదిలీలకు ప్రాధాన్యత పాయింట్ల కోసం గతంలో సమర్పించిన మెడికల్ సర్టిఫికెట్లు చెల్లవని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రాధాన్యత పాయింట్ల కోసం టీచర్లు మరోసారి వైద్యుల ముందు హాజరు కావాలని పేర్కొనడంతో గతనెల 24, 25, 26 తేదీల్లో కేజీహెచ్, ఈఎన్‌టీ, కంటి ఆస్పత్రుల్లో నిర్వహించిన పరీక్షలకు వారు హాజరయ్యారు. ఉమ్మడి జిల్లాలో 600 మంది టీచర్లు 56 శాతం అంతకంటే ఎక్కువ వైకల్యం ఉన్నట్టు గతంలో మెడికల్ బోర్డుల నుంచి సర్టిఫికెట్లు తీసుకుని బదిలీల సమయంలో పాయింట్లు పొందారు. వీరిలో ఎక్కువమంది ఇప్పుడు బదిలీలు కోరుకుంటున్నారు. అందువల్ల 442 మందే వైద్య పరీక్షలకు హాజరయ్యారు. టీచర్లకు సంబంధిత వైద్యులు పరీక్షలు నిర్వహించే సమయంలో పలు రకాల రిపోర్టులను ప్రామాణికంగా తీసుకున్నారు. ఎక్కువగా ప్రైవేటు ఆస్పత్రుల నుంచి తెచ్చిన రిపోర్టులను వైద్యులు క్షుణ్ణంగా పరిశీలించాకే ప్రతి ఉపాధ్యాయుడికి సంబంధించి వైకల్యంపై మెడికల్ బోర్డుకు రిఫర్ చేశారు. వైద్యుల ఎదుట హాజరైన ఉపాధ్యాయులందరూ ప్రాధాన్యత పాయింట్ల కోసమేనని చెప్పనక్కర్లేదు. అయితే వైద్యుల తనిఖీల అనంతరం ఆయా టీచర్ ఇబ్బందులపై రిపోర్టు రాసి మెడికల్ బోర్డుకు నివేదించారు. ఈ నివేదికల మేరకు పలువురు ఉపాధ్యాయులు 'ప్రాధాన్యత కేటగిరీ కిందకు వస్తారని, మరికొందరు రారని బోర్డు స్పష్టం చేసింది'. కాగా కేజీహెచ్ జారీ చేసిన సర్టిఫికెట్‌లో కొన్నింటిపై చేతి రాతతో రాయడం గమనార్హం. అంటే గతంలో ఇచ్చిన రిపోర్టుల్లో ఏమైనా తేడాలున్నాయా? లేదా అప్పటి టీచర్ల ఆరోగ్య పరిస్థితి మేరకు వైద్యులు సర్టిఫికెట్లు జారీ చేశారా.? అన్నది ఎవరూ చెప్పలేని పరిస్థితి. అయితే కొందరి సర్టిఫికెట్ల జారీలో మాత్రం అవకతవకలు జరిగాయని గతంలో పలువురిపై ఫిర్యాదులు వచ్చాయి. గతనెలలో పరీక్షలు నిర్వహించిన వైద్యుల రిపోర్టుల మేరకు రెండు మూడు రోజుల క్రితం కేజీహెచ్, ఈఎన్‌టీ, కంటి ఆస్పత్రి సూపరింటెండెంట్లు విశాఖ జిల్లా విద్యాశాఖాధికారికి సర్టిఫికెట్లను పంపారు. మొత్తం 442 మంది వైద్య పరీక్షలకు హాజరైతే వారిలో సగం మందే ప్రాధాన్యత కేటగిరీలోకి వస్తారని మెడికల్ బోర్డులు ధ్రువీకరించాయి. దీంతో ఈ పర్యాయం బదిలీల్లో ప్రాధాన్యత కేటగిరీలో పాయింట్లు పొంది బదిలీల్లో ... మిగతా 6వ పేజీలో

లీగల్ మెట్రాలజీ దాడులు

- పలు దుకాణాల్లో కాటాల తనిఖీ
- కిలోకు 110 నుంచి 250 గ్రాముల తక్కువ తూకం
- 15 షాపులపై కేసులు నమోదు


చేపల దుకాణంలో కాటాను తనిఖీ చేస్తున్న అధికారులు

కొత్తూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి మండలం పంచాయతీ కొత్తూరు పంచాయతీ శారదానగర్‌లో మాంసాహార విక్రయ దుకాణాల్లో తూనికలు, కొలతల శాఖ (లీగల్ మెట్రాలజీ) అధికారులు ఆదివారం దాడులు నిర్వహించారు. ఆయా వ్యాపారులు వినియోగిస్తున్న కాటాలను అనకాపల్లి అసిస్టెంట్ కంట్రోలర్ బి.రామచంద్రయ్య, గాజువాక ఇన్‌స్పెక్టర్ ఉమసుందరి తనిఖీ చేశారు. చేపల దుకాణం కాటాలో కిలో గుండు పెట్టి చేపలను తూకం వేసి, అనంతరం తమ వెంట తెచ్చుకున్న కాటాతో తూకం వేయగా 750 గ్రాములు మాత్రమే వచ్చింది. కూరగాయల దుకాణంలో కిలోకు 100 గ్రాములు, మటన్, చికెన్ షాపుల్లో కిలోకు 150 గ్రాములు తక్కువ వచ్చినట్టు గుర్తించారు. మొత్తం 15 కాటాలను స్వాధీనం ఆయా దుకాణాలపై కేసులు నమోదు చేశారు. వీటిలో ... మిగతా 6వ పేజీలో


తమతోపాటు తెచ్చిన తూకం రాళ్లతో చికెన్ షాపులో ఎలక్ట్రానిక్ కాటాను తనిఖీ చేస్తున్న అధికారులు

గణితం-1, ఫిజిక్స్-2 పేపర్లు కఠినం

- జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షపై నిపుణుల విశ్లేషణ


పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులతో తల్లిదండ్రులు

విశాఖపట్నం, మే 18 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఐఐటీ/తత్సమాన విద్యా సంస్థల్లో ప్రవేశాలకు జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షను ఆదివారం విశాఖలోని పది కేంద్రాల్లో ఆన్‌లైన్ విధానంలో నిర్వహించారు. గణితం, భౌతిక, రసాయన శాస్త్రాలకు సంబంధించి 48 ప్రశ్నలు ఇచ్చారు. ఉదయం ఇచ్చిన గణితం-1, మధ్యాహ్నం ఇచ్చిన ఫిజిక్స్-2లో పేపర్లలో ప్రశ్నలు కఠినంగా ఉన్నాయని శ్రీచైతన్య ఐఐటీ అకాడమీ డీన్ ఎస్.రఘుకుమార్ తెలిపారు. పరీక్ష రాసిన విద్యార్థుల ఫీడ్‌బ్యాక్ మేరకు విశ్లేషించినట్టు ఆయన పేర్కొన్నారు. ఉదయం పరీక్షలో ఫిజిక్స్ కొంతవరకు బాగానే ఉందని, కెమిస్ట్రీలో ప్రశ్నలు సులువుగా ఉన్నాయన్నారు. మధ్యాహ్నం పరీక్షలో ఫిజిక్స్ కఠినంగా ఉందని, మేథమెటిక్స్, కెమిస్ట్రీ బాగానే వున్నట్టు విద్యార్థులు తెలిపారన్నారు. పరీక్షలకు నగరంలోని అన్ని కేంద్రాల నుంచి సుమారు నాలుగు వేల మంది విద్యార్థులు హాజరయ్యారు.

దళిత నిరుద్యోగుల జీవనోపాధికి నిధుల కేటాయింపు పెంచాలి

▸▸ మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ నాగభూషణం

మునగపాక, మే 18 (ఆంధ్రజ్యోతి): దళిత వర్గానికి చెందిన మాల, మాదిగ నిరుద్యోగుల జీవనోపాధికి నిధులు కేటాయింపు పెంచాలని మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ డొక్కా నాగభూషణం అన్నారు. ఈ మేరకు సీఎం చంద్రబాబునాయుడుకు లిఖితపూర్వకంగా విజ్ఞప్తి చేసినట్టు చెప్పారు. దళిత బిడ్డలు జీవనోపాధి కోసం ప్రభుత్వం రూ.350 కోట్లు కేటాయించిందని, ఆ నిధులు చాలని పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 7లక్షలు మంది దళిత యువకులు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. నిధులు పెంచడం ద్వారా అందరికి న్యాయం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా పలువురు మంత్రులకు కూడా కోరామన్నారు.

గూడుపమ్మ ఆలయానికి భక్తుల తాకిడి



హారతి తీసుకుంటున్న భక్తులు

నక్కపల్లి, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేబాక గూడుపమ్మ ఆలయానికి ఆదివారం భక్తుల తాకిడి నెలకొంది. పలు ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర,రవికలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల గోత్ర నామాలతో ఆలయంలో పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు వంటలు చేసుకుని భోజనాలు చేశారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు



కూలిపోవడానికి సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభాలు

నక్కపల్లి, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపాడు నుంచి అమలాపురం గ్రామానికి వెళ్లే రహదారిలో వున్న కొన్ని విద్యుత్ స్తంభాలు అత్యంత ప్రమాదకరంగా ఉన్నాయి. నిటారుగా వుండాల్సిన సిమెంట్ కరెంటు స్తంభాలు ఒక పక్కకు వాలిపోయి కనబడుతున్నాయి. ఒకేచోట మూడు విద్యుత్ స్తంభాలు పక్కకి ఒరిగిపోయాయి. భారీ ఈదురు గాలులు గనుక వీస్తే ఈ స్తంభాలు పడిపోయే ప్రమాదం వుందని, విద్యుత్ తీగల సపోర్ట్‌తోనే నిలబడుతున్నాయని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

నరక ప్రయాణం

... 5వ పేజీ తరువాయి

జంక్షన్ నుంచి చోడవరం వైపు తుమ్మపాల గ్రామం దాటే వరకు సుమారు మూడు కిలోమీటర్ల మేర రోడ్డు మొత్త ం ఛిద్రమైంది. ఇంకా మార్టూరు జంక్షన్, దర్శినగర్, ఊడేరు, మామిడిపాలెం, ముద్దుర్తి వద్ద భారీ గోతులు ఏర్పడ్డాయి. దర్శినగర్ వద్ద దాదాపు కిలోమీటరు మేర తారురోడ్డు ఆనవాళ్లు లేకుండా పోయింది. కొద్ది రోజుల నుంచి అడపాదడపా కురుస్తున్న వర్షాలకు గోతుల్లో నీరు చేరి, రోజుల తరబడి నిలిచిపోతున్నది. ఈ రోడ్డులో రాత్రి పూట వీధి దీపాలు వెలగకపోవడంతో ద్విచక్ర వాహనదారులు గోతుల వద్ద ప్రమాదాలకు గురవుతున్నారు. గర్భిణులు, వృద్ధులు, ఆస్పత్రికి వెళ్లే రోగులు ఆటోల్లో ప్రయాణిస్తున్నప్పుడు కుదుపులతో చాలా ఇబ్బంది పడుతున్నారు.

మెడికల్ సర్టిఫికెట్ల మాయాజాలం!

... 5వ పేజీ తరువాయి

మంచి స్థానాలు పొందే అవకాశాన్ని కొందరు కోల్పోయారు. ఈ పర్యాయం బదిలీల్లో ఒక పాఠశాలలో 50 శాతానికి మించి ప్రాధాన్యత కేటగిరీలో టీచర్లు రాకుండా ప్రభుత్వం ఆంక్షలు విధించింది. దీంతో నగరం, పరిసరాల్లో పలు పాఠశాలలకు ఇతర కేటగిరీ టీచర్లు రానున్నారని విద్యాశాఖ వర్గాలు తెలిపాయి.

లీగల్ మెట్రాలజీ దాడులు

... 5వ పేజీ తరువాయి



మటన్ దుకాణంపై కేసు రాస్తున్న గాజువాక ఇన్‌స్పెక్టర్ ఉమసుందరి

తక్కెట కాటాలు ఏడు, ఎలక్ట్రానిక్ కాటాలు రెండు, కౌంటర్ కాటాలు ఆరు వున్నాయి. తక్కువ తూకంతో వినియోగదారులను మోసగించే వ్యాపారులపై నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని అసిస్టెంట్ కంట్రోలర్ బి.రామచంద్రయ్య తెలిపారు. ప్రతి తూకం యంత్రానికి తమ శాఖ వేసిన సీల్ తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. తనిఖీల్లో సిబ్బంది లీలా శ్రీనివాస్, ఎస్.కె.బాజీ, కృష్ణతులసి పాల్గొన్నారు.

హాకీ..మరింత చలాకీ



నక్కపల్లిలో నిర్మించిన ఆస్ట్రో టర్ఫ్ మినీ హాకీ గ్రౌండ్



కొత్త మైదానంలో హాకీ సాధన చేస్తున్న క్రీడాకారులు

▸▸ ఉత్తరాంధ్రలోనే నక్కపల్లిలో తొలి ఆస్ట్రో టర్ఫ్ గ్రౌండ్

▸▸ 8 ఏళ్లలో అంచెలంచెలుగా ఎదిగిన హాకీ క్లబ్

▸▸ పలువురికి ఉద్యోగాలు.. మరికొందరికి ఉన్నత విద్యావకాశాలు

నక్కపల్లి, మే 18 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లి పరిసర ప్రాంత పిల్లలకు హాకీ అంటే ఏమిటో తెలియదు.. ఎవరికీ ఆసక్తి కూడా లేదు... అటువంటి ప్రాంతంలో ఓ కానిస్టేబుల్ మెరికల్లాంటి హాకీ క్రీడాకారులను తయారు చేశాడు. అంతేకాదు స్పోర్ట్స్ కళాశాలలో సీట్లు, ఆపై ఉద్యోగాలు రావడంతో ఈ ప్రాంతంలో హాకీ క్రీడ పట్ల ఆసక్తి పెరిగింది.

నక్కపల్లిలో ఎనిమిదేళ్ల క్రితం పోలీస్ కానిస్టేబుల్ బలిరెడ్డి సూరిబాబు తన తల్లిపేరున హాకీ క్లబ్‌ను ఏర్పాటు చేసి పది మంది పిల్లలతో హాకీ సాధన ప్రారంభించారు. తొలుత తల్లిదండ్రుల వద్దకు వెళ్లి పిల్లలను హాకీ సాధనకు పంపండి.. మీ పిల్లల భవిష్యత్తుకు మేము భరోసా ఇస్తామంటూ హాకీ క్లబ్ వ్యవస్థాపకులు సూరిబాబు, సెక్రటరీ తాతాజీ అభ్యర్థించారు. కేవలం 10 మంది పిల్లలతో ప్రారంభమైన నక్కపల్లి బీఎస్ హాకీ క్లబ్‌లో ఇప్పుడు 80 మంది క్రీడాకారులు చేరారు. నక్కపల్లి, ఉపమాక పరిసర గ్రామాలకు చెందిన ఎంతో మంది శిక్షణ పొందుతున్నారు. కోచ్‌లతోపాటు బలిరెడ్డి సూరిబాబు కూడా క్రీడాకారులకు ఆటలో విజయం కన్నా, మెలకువలు నేర్చుకునేలా సాధన ఇచ్చారు. ఫలితంగా 40 మంది క్రీడాకారులు, రాష్ట్ర, జాతీయ స్థాయి టోర్నమెంట్లలో రాణించారు. పలు సందర్భాల్లో చాంపియన్లుగా కూడా నక్కపల్లి హాకీ క్రీడాకారులు నిలిచారు.

స్పోర్ట్స్ స్కూళ్లలో సీట్లు పొందిన నలుగురు క్రీడాకారులకు ఇండియన్ ఆర్మీలో ఉద్యోగాలు లభించాయి. మరో 20 మంది వరకూ స్పోర్ట్స్ కళాశాలల్లో సీట్లు లభించాయి. దీంతో తల్లిదండ్రులు, స్థానిక రాజకీయ నాయకులు హాకీ క్లబ్ అభివృద్ధి కోసం తమ వంతుసాయమందించారు. ఫలితంగా 2023లో ఏపీ ప్రభుత్వం మినీ హాకీ గ్రౌండ్ నిర్మాణం కోసం రూ1.6 కోట్లు మంజూరు చేసింది. ఇటీవలే హోం మంత్రి అనిత ఈ గ్రౌండ్‌ను ప్రారంభించారు.

ఆస్ట్రో టర్ఫ్ హాకీ గ్రౌండ్

హాకీ సాధన చేసే క్రీడాకారులకు అనువైన ఆస్ట్రో టర్ఫ్ హాకీ మైదానాలు ఇప్పటి వరకూ కడప, పులివెందుల, కాకినాడల్లో మాత్రమే వున్నాయి. ఇప్పుడు ఆ జాబితాలో నక్కపల్లి కూడా చేరింది. నక్కపల్లిలో నిర్మించిన నూతన హాకీ గ్రౌండ్ ఏపీలో నాలుగోది కావడం విశేషం. ఆస్ట్రో టర్ఫ్ మైదానంలో క్రీడాకారులు మరింత వేగంగా ఆడడానికి, బంతి నియంత్రణకు అనువుగా వుంటుందని హాకీ కోచ్‌లు చెబుతున్నారు. నిజమైన గడ్డి కంటే పదునుగా వుండే కృత్రిమ గడ్డితో చేసిన మైదానాన్ని ఆస్ట్రో టర్ఫ్ అంటారని చెప్పారు. నక్కపల్లి జడ్పీ హైస్కూల్‌లో అధునాతన టెక్నాలజీతో ఈ గ్రౌండ్‌ను నిర్మించారు. ఈ గ్రౌండ్ అందుబాటులోకి రావడంతో భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధిస్తామని నక్కపల్లి హాకీ క్రీడాకారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

జాతీయ జట్టులో స్థానమే లక్ష్యం



బలిరెడ్డి సూరిబాబు, బీఎస్ హాకీ క్లబ్ వ్యవస్థాపకుడు

నక్కపల్లి హాకీ క్లబ్ అభివృద్ధికి అందరూ సహకరిస్తున్నారు. ఇక్కడ సాధన చేసే క్రీడాకారులు జాతీయ హాకీ జట్టులో స్థానం దక్కాలన్నదే మా లక్ష్యం. ఆ దిశగానే సాధన చేసేలా ప్రణాళికలు రూపొందించాం. ఇప్పటికే కొందరికి ఉద్యోగాలు లభించాయి. హాకీ సాధనకు సొంత మైదానం కావాలన్న కోరిక నెరవేరింది. చాలా సంతోషంగా వుంది. హాకీతో ఉద్యోగం లభించింది

స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం



ఆర్మీ ఉద్యోగి కొల్నాటి దుర్గాప్రసాద్

నాకు హాకీ అంటే ఏమిటో తెలియదు. మొదట్లో నాకు ఇష్టం లేకపోయినా హాకీ వ్యవస్థాపకులు సూరిబాబు తల్లిదండ్రులను ఒప్పించారు. అయిష్టంగానే వెళ్లినా.. ఆ తరువాత ఆసక్తి పెరిగింది. అనేక టోర్నమెంట్లలో అద్భుతమైన విజయాలు సాధించారు. ఈ కారణంగానే స్పోర్ట్స్ కోటాలో పశ్చిమ బెంగాల్ ఆర్మీ బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా ఉద్యోగం లభించింది.

కొడవటిపూడి యూపీ స్కూల్ అప్‌గ్రేడ్

▸▸ ఐదో తరగతి వరకు మోడల్ స్కూల్

▸▸ ఈ ఏడాది నుంచి 8వ తరగతి నిర్వహణ

కోటవురట్ల, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొడవటిపూడి యూపీ స్కూల్‌కి మంచి రోజులు వచ్చాయి. యూపీ స్కూల్‌ను హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇప్పటి వరకు కొడవటిపూడి పాఠశాలలో 1నుంచి 7 తరగతులు నిర్వహించేవారు. ఒకటి నుంచి 5వ తరగతి వరకు ఈ పాఠశాలను మోడల్ ప్రైమరీ స్కూల్ చేశారు. అనంతరం ఆరు, ఏడు తరగతులు ఇంతవరకు ఉండేవి. ఇకపై ఈ ఏడాది నుంచి ఎనిమిద తరగతి కూడా ఇక్కడ నిర్వహిస్తారు. ప్రతీ ఏడాది ఒక్కొక్క తరగతి చొప్పున పదో తరగతి వరకు అప్‌గ్రేడ్ చేస్తారు.

కొడవటిపూడి యూపీ స్కూల్‌లో ఎన్‌రోల్‌మెంట్ పెంపునకు టీచర్స్ ఇంటింటికి తిరిగి ప్రభుత్వ,ప్రైవేట్ పాఠశాలను పోలుస్తూ కరపత్రాలను పంపిణీ చేసి, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాల్లో కల్పించే మధ్యాహ్నభోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, బూట్లు, ఉచిత నోట్‌పుస్తకాలు, డిజిటల్ బోధన, కళలు, విద్య, కంప్యూటర్ విద్య, వ్యాయామ విద్య, యోగా వంటి అంశాలను వివరిస్తూ టీచర్స్ ప్రచారం చేశారు.



అప్‌గ్రేడ్ చేసిన కొడవటిపూడి పాఠశాల

వారు శ్రమ ఫలితంగా 52 మంది విద్యార్థులు పాఠశాల్లో చేరారు. ఈ నేపథ్యంలో పాఠశాల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడంతో మండల విద్యాశాఖాధికారులు రామారావు, జోషి కొడవటిపూడి యూపీ స్కూల్‌ను హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయాలని జిల్లా అధికారులకు ప్రతిపాదనలు పంపారు. ఈ ప్రతిపాదనలకు జిల్లా అధికారులు వెంటనే ఆమోదం తెలుపుతూ జీవోను విడుదల చేశారు. ఒకటి నుంచి 5వతరగతి వరకు ఒక స్కూల్ అసిస్టెంట్‌తోపాటు మరొక నలుగురి ఎస్‌జీటీ టీచర్స్ పోస్టులు మంజూరు కానున్నాయి.

ఆరు, ఏడు తరగతుల వరకు ఉన్న యూపీ స్కూల్‌లో ఈ ఏడాది 8వ తరగతి ఇక్కడ నిర్వహిస్తారు. వచ్చే రెండేళ్లలో పదో తరగతి వరకు అప్‌గ్రేడ్ అవుతుంది. ఇందుకు అవసరమైన ఉపాధ్యాయ పోస్టు మంజూరు కానున్నాయి. ప్రస్తుతం 6,7 తరగతుల్లో 74మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాల అప్‌గ్రేడ్ కావడానికి కృషి చేసిన పాఠశాల హెచ్‌ఎం కృష్ణప్రసాద్, ఉపాధ్యాయులకు గ్రామస్థులు, తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటా..

▸▸ ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

రాంబిల్లి, మే 18 (ఆంధ్రజ్యోతి): ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ సుపరిపాలన అందిస్తానని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. ఆదివారం హరిపురం జనసేన పార్టీ కార్యాలయంలో జరిగిన నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడు పార్టీల నాయకులు ఐక్యంగా పనిచేయడం వలన విజయం సులభతరమైయిందన్నారు. తన విజయానికి కృషిచేసిన నాయకులు, కార్యకర్తలు అందరికి న్యాయం చేస్తానన్నారు. ప్రజలు తనపై చూపిన అభిమానాన్ని మరచిపోలేనన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సుపరిపాలన అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ రాంబిల్లి, అచ్యుతాపురం మండల శాఖల అధ్యక్షులు బి.శ్రీరామదాసు, పప్పల నూకన్నదొర, నాయకులు జనపరెడ్డి శ్రీనివాసరావు, మోటూరి త్రివేణి, బాబ్జి, నాలుగు మండలాల నేతలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

మడుతూరులో ఎమ్మెల్యే సుందరపు పర్యటన

అచ్యుతాపురం రూరల్: మండలంలోని మడుతూరు గ్రామంలో ఆదివారం ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ద్విచక్రవాహనంపై పర్యటించారు. మడుతూరు జంక్షన్ నుంచి స్పెషల్ ఎకనామిక్ జోన్ వరకు రోడ్డు నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. అచ్యుతాపురం జంక్షన్ నుంచి మడుతూరు గ్రామం మీదుగా కంపెనీలకు రోడ్డు కలిపే విధంగా ప్రతిపాదనలు రూపొందించాలని స్పెషల్ ఎకనామిక్ జోన్ డిప్యూటీ జోనల్ మేనేజర్‌ను ఆదేశించారు. మడుతూరు గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఎక్కడపడితే అక్కడ చెత్త వేయరాదన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఉమ్మడి విశాఖ జిల్లా కార్యదర్శి మోటూరి కృష్ణవేణి, టీడీపీ నాయకులు శనివాడ ఆనందరావు, సుంకర శ్రీనివాసరావు, దేశంశెట్టి సన్యాసినాయుడు, జనసేన నాయకులు నీరుకొండ సంతోషరావు, ఎస్.నూకునాయుడు, ఎస్.చిన్ని, వెలంశెట్టి శశిరావు, జనపరెడ్డి నాగమణి, ఎం.సుజాత, పి.శివాజీకృష్ణ, ఎర్రంశెట్టి రాజు, ఎన్.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



హైస్కూల్‌లో కలుసుకున్న ఎం.జగన్నాథపురం పూర్వ విద్యార్థులు

అచ్యుతాపురం రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.జగన్నాథపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో 1999- 2004 వరకు చది విన పూర్వ విద్యా ర్థులు ఆదివారం కలుసుకున్నారు. వాళ్లంతా 21 ఏళ్ల క్రితం కలుసుకోవడంతో ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ ఆప్యాయంగా పలకరించుకున్నారు. యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆ నాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఇటీవల మరణించిన సహచర మిత్రులకు నివాళులర్పించారు. తొలుత స్కూల్ ఆవరణలో సరస్వతి దేవి విగ్రహానికి పూల మాలలు వేసి అంజలి ఘటించారు. విద్యాబుద్దులు నేర్పించి ఉన్నతికి బాటలు వేసిన అప్పటి గురువులు శ్రీనివాసరావు, నరసింహరాజు, లక్ష్మీనారాయణ, సత్తిబాబు మాస్టారులను వెండి షీల్డ్, శాలువ, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు కృష్ణవేణి, కాంతి, చిట్టి, లక్ష్మి, అరుణ, వేణు, చిరంజీవి, శ్రీను, నాగేష్, రమేష్ పాల్గొన్నారు.

ఎలమంచిలిలో మినీ మహానాడు రేపు

ఎలమంచిలి, మే 18 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న మహానాడు ఈనెల 20వ తేదీన పట్టణంలోని గురవప్ప కల్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్టు టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొర్లె నానాజీ తెలిపారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరావు, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులు, అభిమానులకు ఆయన పిలుపునిచ్చారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా నేతలు పాల్గొంటారని తెలిపారు.

వెంకటనగరంలో మెరైన్ పోలీసుల పల్లె నిద్ర



వెంకటనగరంలో గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ డి.రత్నశేఖర్

పాయకరావుపేట రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటనగరం మత్స్యకార గ్రామంలో శనివారం రాత్రి పెంటకోట మెరైన్ పోలీసులు పల్లె నిద్ర చేశారు. ఈ సందర్భంగా మెరైన్ ఎస్ఐ డి.రత్నశేఖర్ గ్రామంలో మత్స్యకారులు, గ్రామ పెద్దలతో సమావేశం నిర్వహించి తీవ్రవాదులు, దేశ వ్యతిరేక శక్తులు, స్లీపర్‌సెల్స్, వారి ఉత్పన్నమయ్యే ప్రమాదాలు వివరించారు. అదేవిధంగా అనుమానాస్పద బోట్లు, మనుషులు, నిషేధిత మాదకద్రవ్యాల సమాచారం తెలిసిన వెంటనే టోల్ ఫ్రీ నం.1093 లేదా పెంటకోట మెరైన్ పోలీస్ స్టేషన్‌కి సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

'త్వరలో అన్నదాత సుఖీభవ పథకం'



విజయ్‌ను సత్కరించిన రైతులు

మునగపాక, మే 18 (ఆంధ్రజ్యోతి): రైతులందరికి అన్నదాత సుఖీభవ పథకం త్వరలో అందనుందని టీడీపీ మండల అధ్యక్షుడు పెంటకోట విజయ్ అన్నారు. ఆదివారం స్థానిక తంపరమూల రైతు సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. గత వైసీపీ అనుసరించిన విధానాలు కారణంగా పలు పథకాలు అమల్లో జాప్యం ఏర్పడుతోందన్నారు. అన్నదాత సుఖీభవ పథకంనకు సంబంధించి నమోదు ప్రక్రియ జరుగుతోందని, సచివాలయంనకు వెళ్లి నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం విజయ్‌ను తంపరమూల రైతులు ఘనంగా సత్కరించారు.

నేటి నుంచి టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

నక్కపల్లి, మే 18 (ఆంధ్రజ్యోతి): ఈనెల 19వ తేదీ సోమవారం నుంచి నక్కపల్లిలోని రెండు పరీక్షా కేంద్రాల్లో టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతాయని ఎంఈవో కె.నరేశ్ ఆదివారం చెప్పారు. బాలికల ఉన్నత పాఠశాల, గురుకులంలో రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకూ పరీక్షలు జరుగుతాయని, 220 మంది పిల్లలు పరీక్షలకు హాజరవుతారని చెప్పారు.

22న మునగపాకలో హనుమ జయంతి

మునగపాక, మే 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంతబయలు అభయాంజనేయ ఆలయం వద్ద ఈనెల 22వ తేదీన హనుమ జయంతిని నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధి కాండ్రేగుల మణికంఠ తెలిపారు. గురువారం ఉదయం 5 గంటల నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, లక్ష తులసి పత్రి పూజ నిర్వహిస్తామన్నారు. అదే రోజు మధ్యాహ్నం అన్నసమారాధన కూడా ఏర్పాటు చేస్తామన్నారు.

తెలుగు రాష్ట్రాల స్థాయిలో నాటిక పోటీలు

▸▸ గ్రామీణ యువజన మందిరం అధ్యక్షుడు శ్రీకాంత్

మునగపాక, మే 18 (ఆంధ్రజ్యోతి): ఆగస్టు నెలలో గ్రామీణ యువజన మందిరం 61వ వార్షికోత్సవం సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో నాటిక పోటీలు నిర్వహించనున్నట్టు మందిరం అధ్యక్షుడు ఆడారి శ్రీకాంత్ తెలిపారు. స్థానిక గ్రామీణ యువజన మందిరం ఆవరణలో ఆదివారం జరిగిన కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల స్థాయిలో నాటిక పోటీలు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. అలాగే గ్రామ స్థాయి క్రీడా పోటీలు కూడా ఉంటాయని తెలిపారు. సమావేశంలో సూరిశెట్టి రాము, దాడి మునిలినాయుడు, మళ్ల రామజగన్నాథం, మళ్ల జోగారావు పాల్గొన్నారు.

గ్రామ జ్యోతి యువత శ్రమదానం



రోడ్డు వెంబడి మొక్కలను తొలగిస్తున్న గ్రామ జ్యోతి యువత

ఎలమంచిలి, మే 18 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలోని కొక్కిరాపల్లి వార్డుకు చెందిన గ్రామ జ్యోతి యువత సేవా కార్యక్రమాలు చేపడుతూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆదివారం గ్రామంలోని వీధుల్లో శ్రమదానం చేపట్టి వీధుల్లో ఉన్న చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు. గత కొన్ని నెలలుగా గ్రామజ్యోతి యువత చేపడుతున్న సేవా కార్యక్రమాలకు స్థానికులు సైతం అభినందనలు తెలుపుతున్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న టీడీపీ నాయకులు

పాయకరావుపేట రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలో మాసాహెబ్‌పేటకు చెందిన గెడ్డమూరి సూర్యనారాయణకు వైద్య ఖర్చుల నిమిత్తం రాష్ట్ర హోం మంత్రి అనిత సిఫార్సు మేరకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.1,15,323 సాయాన్ని పాయకరావుపేట ఏఎంసీ వైస్ ఛైర్మన్ కంకిపాటి వెంకటేశ్వరరావు ఆదివారం పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు గ్రామంలో సూర్యనారాయణ ఇంటికి వెళ్లి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు అప్పన నాగేశ్వరరావు, యూనిట్ ఇన్‌చార్జి వెంకటరమణ, నాయకులు ఎలిశెట్టి సత్యనారాయణ, వెలుగుల శివ, కంకిపాటి అప్పలరాజు, కంకిపాటి వెంకట సంజీవ్, కొంతం గంగారావు, వెలుగుల గంగారావు పాల్గొన్నారు.

'మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి'



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న తులసీరావు, తదితరులు

అచ్యుతాపురం రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యానికి హాని కలిగించే మత్తుపదార్థాలకు యువత దూరంగా ఉండాలని ఎంటీఆర్‌వై హిందుస్థాన్ స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఎం.తులసీరావు అన్నారు. ఆదివారం ఎంటీఆర్‌వై హిందుస్థాన్ అండ్ ఎడ్యుకేషన్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో పూడిమడక నుంచి సీతపాలెం వరకు సముద్రతీర ప్రాతంలో ఏటి డ్రగ్స్ ఎవర్నెస్ బీచ్ రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ డ్రగ్స్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు.ఈ సందర్భంగా పలువురు యువకులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రెడ్డి కృష్ణ, నరేష్, రబ్బీ కోచ్ వెంకట్, నిర్వాహక బృందం అరుణ్‌కుమార్, అప్పలరాజు, 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ఎలమంచిలి, మే 18 (ఆంధ్రజ్యోతి):ఎలమంచిలిలోని గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం 1993-96 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ కలయిక జరిగింది. ఈ సందర్భంగా వారు అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. యోగక్షేమాలను తెలుపుకున్నారు. అందరూ కలిసి భోజనాలు చేశారు. అనంతరం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్‌ను బీఏ ఫ్రెండ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.జానకీరామ్, పూర్వ విద్యార్థులు కలిసి కళాశాల అభివృద్ధికి మరింత ప్రోత్సాహం అందిస్తామన్నారు.

చిట్టి చేతులతో చక్కని బొమ్మలు



రంగు కాగితాలతో పిల్లలు తయారు చేసిన బొమ్మలు

నక్కపల్లి, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినదొడ్డిగల్లు గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం చిట్టి చేతులతో చక్కనైన బొమ్మలు (పేపర్ క్రాఫ్ట్) అనే కార్యక్రమాన్ని గ్రంథాలయాధికారి కె.జనార్దన్ నేతృత్వంలో నిర్వహించారు. పలు రకాల రంగు కాగితాలతో పిల్లలు ఆకర్షణీయమైన, కళారూపాలను తయారు చేసి ప్రదర్శించారు. రిసోర్స్‌పర్సన్ కె.రంగబాబు మాట్లాడుతూ ఇటువంటి పోటీలు నిర్వహించడం వల్ల పిల్లల్లో సృజనాత్మకత పెరుగుతుందన్నారు. రంగు కాగితాలను ఉపయోగించి పుష్పగుచ్ఛాలు, బాల్స్ ఫొటో ఫ్రేమ్స్ ఫ్లవర్ స్టాండ్ వంటి వాటిని విద్యార్థులు తయారు చేశారు.



కల్యాణోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రాజు

ముగిసిన వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు

చోడవరం, మే 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివారం వేంకటేశ్వరస్వామి కల్యాణ ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా భక్తులకు అన్నసమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ వింజమూరి శంకర్, బీజేపీ ఇన్‌చార్జి కందర్ప రమణమూర్తి, జనసేన నాయకులు సిరిపురపు రమేశ్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు దేవరపల్లి వెంకట అప్పారావు, సభ్యుడు శ్రీను, టీడీపీ నాయకులు సకురు కోటేశ్వరరావు, సేనాపతి శ్రీనివాసరావు, ఆలయ కమిటీ,ప్రోత్సాహకులు ఉపాధ్యాయుల శ్రీనివాస్, పార్డురాజు, పప్పు శ్రీను, జలుమూరి కాశిరాజు, పనసారెడ్డి, భక్త మహిళా మండలి సభ్యులు, శ్రీవారి సేవకులు పాల్గొన్నారు.

మరిడిమాంబ జాతర పోస్టర్ విడుదల



పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

దేవరాపల్లి, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిననందిపల్లి మరిడిమాంబ గ్రామ దేవత జాతర పోస్టర్లను ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి ఆవిష్కరించారు. ఈ నెల 29న పండుగ జరగనుంది. ఈ పోస్టర్లను మేరకు ఆదివారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ భాస్కరరావు, పార్టీ మండల అధ్యక్షుడు పెద్దాడ వెంకటరమణ, జలాశయ చైర్మన్ పాత్రునాయుడు తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో 20 మంది చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న నర్సీపట్నం ఇన్‌చార్జి సూర్యచంద్ర

గొలుగొండ, మే 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివారం 20 మంది వైసీపీ కార్యకర్తలు జనసేన పార్టీలో చేరారు. జనసేన నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి రాజాన వీరసూర్యచంద్ర ఆధ్వర్యంలో గొలుగొండ గ్రామ పంచాయతీ నుంచి ఏడో వార్డు సభ్యుడు పండా ప్రసాద్, వైసీపీ సీనియర్ నాయకులు పండా హరేరామ్, పరవాడ బాబూరావుతో పాటు 20 మంది కార్యకర్తలు కండువాలు కప్పుకున్నారు. ఈ సందర్భంగా సూర్యచంద్ర మాట్లాడుతూ జనసేన పార్టీ సిద్ధాంతాలు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆశయాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు గండెం దొరబాబు, నాయకులు రేగుబళ్ల శివ, ఊడి చక్రవర్తి, ఎర్రంశెట్టి పాపారావు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు బోయిన చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



అల్లూరి పార్కులో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

కృష్ణాదేవిపేట, మే 18 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలంలోని ఏఎల్‌పురం ఉన్నత పాఠశాలలో 2001-2002లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఆత్మీయంగా కలుసుకున్నారు. అల్లూరి పార్కులో వారంతా సందడి చేశారు. తొలుత ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకుని యోగక్షేమాలు తెలుసుకున్నారు. అంతా సమావేశమై పాఠశాల అభివృద్ధితో పాటు కష్టాల్లో ఉన్న స్నేహితులకు బాసటగా నిలవాలని నిర్ణయించుకున్నారు. మధ్యాహ్నం వన భోజనాలు అనంతరం ఆటపాటలతో సరదాగా గడిపారు. ఈ సందర్భంగా అప్పటిలో చదువులు చెప్పిన ఉపాధ్యాయులు అచ్యుతం, గిరిబాబు, పల్లి సత్యనారాయణ, సిహెచ్.రమణ, లగుడు రాజశేఖర్, సూర్యనారాయణ, పీడీ గోవిందలను ఘనంగా సత్కరించారు.

అనుమానాస్పద స్థితిలో లారీ డ్రైవర్ మృతి

- విశాఖలో ఉంటున్న చిన్నారావు ట్యాంకర్ ద్వారా కాకినాడలో ఆయిల్ అన్‌లోడ్
- లంకెలపాలెం పెట్రోల్ బంకు వద్ద రాత్రి పార్కింగ్
- ఉదయం విగతజీవిగా మారడంతో కేసు నమోదు



మృతి చెంది ఉన్న డ్రైవర్ చిన్నారావు

లంకెలపాలెం, మే 18 (ఆంధ్ర జ్యోతి): అనుమానాస్పదంగా ఓ ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్ మృతి చెందాడు. జాతీయ రహదారి లంకెలపాలెం పెట్రోల్ బంకు వద్ద చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలివి. శ్రీకాకుళం జిల్లా జి.సిగడాం మండలం బాతువ ప్రాంతానికి చెందిన పాండంగి చిన్నారావు (40) ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. విశాఖపట్నం వెంకోజీపాలెంలో కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నాడు. కాకినాడలో ఆయిల్ అన్‌లోడ్ చేసి బయల్దేరి, పరవాడ మండలం లంకెలపాలెం పెట్రోల్ బంకు వద్ద శనివారం రాత్రి వాహనాన్ని పార్కింగ్ చేశాడు. ఆది వారం ఉదయానికి అతడు తన ట్యాంకర్ వాహనం పక్కనే విగతజీవిగా పడి ఉన్నాడు. ఇది గుర్తించిన స్థానికులు పరవాడ పోలీసులకు సమాచారం అందిం చారు. వెంటనే వారు వచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. అయితే మృతదేహంపై ఎలాంటి గాయాలు లేవని, అనారోగ్యం కారణంగానే మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	110.00
లైవ్ ధర	130.00
విత్ స్కిన్	230.00
స్కిన్ లెస్	240.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	545
విజయనగరం	549
శ్రీకాకుళం	549

అత్యవసర వైద్యం.. దైవాదీనం!

తురకలపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సక్రమంగా అందని సేవలు

- అర్ధరాత్రి వేళ్తే.. అనకాపల్లి ఆస్పత్రికి రిఫర్
- మార్గమధ్యంలో కోల్పోతున్న ప్రాణాలు
- ఆందోళనలో పీహెచ్‌సీ పరిధిలోని ప్రజలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



తురకలపూడి పీహెచ్‌సీ

బుచ్చెయ్యపేట, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో తురకలపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు అత్యవసర వైద్య సేవలు అందని ద్రాక్షలా మారాయి. వైద్య సిబ్బంది పూర్తి స్థాయిలో లేకపోవడంతోనే ఈ దుస్థితి దాపురిస్తున్నది. సుమారు 50 ఏళ్ల క్రితం ఈ పీహెచ్‌సీని ఏర్పాటు చేశారు. పీహెచ్‌సీని అప్పట్లో 24గంటల ఆస్ప త్రిగా మార్చారు. కాలక్రమేణా భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో ఇటీవల నూతనంగా భవనం నిర్మించి పది పడకల ఆస్పత్రిగా మార్పుచేశారు. కానీ, అత్య వసర సేవలకు మాత్రం దూరంగా ఉంటోంది. రాత్రి సమయాల్లో ఎవరైనా గుండెపోటు, పాముకాటు, ప్రమాదాల బారినపడి, ఇక్కడికి వస్తే పీహెచ్‌సీలో అత్యవసర వైద్యం అందడం లేదు. దీంతో వైద్యం ఇక్కడ లభించక రోగులను అనకాపల్లి తరలించాల్సి వస్తోంది. ఈ క్రమంలో అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారు. దీనికితోడు 108 వాహనం సకాలంలో రాకపోవడం, ఇక్కడి ఆస్పత్రిలో అత్యవసర వైద్యం అందక ఎన్నో సార్లు రోగులు విపత్కర పరిస్థితి ఎదుర్కొంటున్నారు. గతంలో రోజుకో వైద్య నిపుణుడు ఈ ఆస్పత్రికి వచ్చి అందుబాటులో ఉండేవారు. ప్రస్తుతం ఆ సదుపాయం లేదు.

రావికమతం మండల వాసులకు బుచ్చెయ్యపేట మండలంలో 25 గ్రామాలకు ఈ పీహెచ్‌సీపై ఆధారపడి వైద్యం పొందుతున్నారు. రాజాం, తట్టబంద రోడ్డులో రవాణా సౌకర్యం ఉండడంతో ఈ పీహెచ్‌సీకి రావికమతం మండలంలో రోగులకు వస్తుంటారు. రెండు మండలవాసులకు అనువుగా ఉన్న ఈ పీహెచ్‌సీకి రోగులు వస్తే అత్యవసర వైద్యం అందక ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ఇకనైనా అంత్యవసర వైద్యానికి ఏర్పాట్లు చేయాలని రోగులు కోరుతున్నారు. రాత్రి వేళ ఒక స్టాఫ్‌నర్సుతో ఆస్పత్రి నడుస్తోంది. అత్యవసర వైద్యం కోసం తగిన సిబ్బందిని నియమించాలని, పీహెచ్‌సీ స్థాయిని పెంచాలనిమండల వాసులు, నాయకులు కోరుతున్నారు.

అత్యవసర వైద్య సదుపాయం కల్పించాలి



గుండెపోటు, ప్రమాదాల్లోగా యపడిన వారిని ఈ ఆస్పత్రికి తీసుకువెళ్తే అనకాపల్లి తరలించాలని సిబ్బంది తెలుపుతున్నారు. కానీ, అనకాపల్లి వెళ్లే క్రమంలో అనేకమంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ పీహెచ్‌సీలో అత్యవసర వైద్యం అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. నాయకులు ఈ మేరకు చొరవ తీసుకోవాలి.

-వెంకటనారాయణ, సీతయ్యపేట

గుండుబాడు మినీ రిజర్వాయర్‌ను పునరుద్ధరిస్తాం

- జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్.రాజు



మినీ రిజర్వాయర్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న రాజు

రోలుగుంట, మే 18 (ఆంధ్రజ్యోతి): గుండుబాడు మినీ రిజర్వాయర్‌ను పునరుద్ధరించి ఈ ప్రాంత రైతులకు సాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతామని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు పేర్కొన్నారు. గుండుబాడు పంచాయతీ శివారు గుర్రాలపాలెంలో ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు దశాబ్దాల క్రితం గుర్రాలపాలెం సరిహద్దుల్లో నిర్మించిన గుండుబాడు మినీ రిజర్వాయర్ పలు కారణాలతో నిరుపయోగంగా మిగిలిపోయిందన్నారు. దీనివల్ల సుమారు వెయ్యి ఎకరాలకు సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లోకి మట్టి ఎక్కువగా పేరుకుపోవడం వల్లలోతు తగ్గి పూర్తిస్థాయిలో నీరు నిల్వ ఉండడం లేదన్నారు. దీంతో పాటు కుడి, ఎడమ కెనాల్‌లు కూడా పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. వీటికి మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకువస్తే సాగునీటికి ఢోకా ఉండదన్నారు. ఈ సమస్యను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి నిధులు మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు బలిజి మహారాజు, నాయకులు లోవరాజు, వజ్రపు రమేశ్, చెరకాన సత్తిబాబు, బలిజి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

గుమ్మాళ్లపాడులో ఘనంగా మారమ్మతల్లి జాతర



పసుపు, కుంకుమతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళా భక్తులు

రావికమతం, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మాళ్లపాడు గ్రామంలో ఆదివారం పసల మారమ్మతల్లి జాతరను ఘనంగా నిర్వహించారు. గ్రామ శివారు రాతి చెరువు గట్టు వద్దనున్న అమ్మవారి పండుగను రెండేళ్లకోసారి గ్రామస్థులు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఇందులో భాగంగా గ్రామంలోని పశువులను అమ్మవారి చెంతకు తీసుకువచ్చి పూజలు చేశారు. అలాగే ప్రతీ ఇంటి నుంచి పసుపు, కుంకుమలు, చీరలు, పండ్లతో భారీ ఊరేగింపుగా గ్రామస్థులు ఆలయం వద్దకు వచ్చారు. అక్కడ పూజలు చేసిన అనంతరం అమ్మవారి పాదాల ముందు పశువులను నిలిపి పసుపు, కుంకుమను అలంకరించి, ఏ విధమైన వ్యాధులు రాకుండా చూడాలని మొక్కుకున్నారు. గ్రామ సర్పంచ్ బంటు సన్యాసి నాయుడు, నాయకులు శ్రీను, కాళింగ సన్యాసినాయుడు, బంటు రామునాయుడు, సిద్ధా సత్యారావు, పిల్లా నాగేశ్వరరావు జాతరకు తగిన ఏర్పాట్లు చేశారు.

గదబపాలెంలో మోదమాంబకు పూజలు

రావికమతం, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టి.అర్జాపురం శివారు కె.గదబపాలెం మోదమాంబకు ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఏటా అంత్యంత వైభవంగా నిర్వహించే అమ్మవారి పండుగకు ముందే వంద మంది భక్తులు 40 రోజులుగా మాలధారణతో దీక్షలు చేస్తున్నారు. వారంతా ఆదివారం అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అలాగే పండగ రోజు మంగళవారం అర్జాపురం నుంచి నాలుగు కిలోమీటర్ల మేర 101 ఘటాలతో మహిళలు ఊరేగింపుగా తరలివచ్చి అమ్మవారికి సమర్పిస్తారు. అదే రోజున జిల్లా స్థాయి ఎడ్ల బండి పరుగు పోటీలు ఏర్పాటు చేస్తున్నట్టు ఉత్సవ కమిటీ తెలిపింది.



అమ్మవారి పూజల కోసం రైతులు తీసుకు వచ్చిన పశువులు

కూరగాయల ధరలు పతనం

12 కిలోల బెండకాయల క్రేట్ రూ.50.. వంకాయలు రూ.250

మార్కెట్‌లోకి అధికంగా సరకు రావడమే కారణం



మార్కెట్‌లో విక్రయానికి రైతులు తీసుకు వచ్చిన కూరగాయలు

దేవరాపల్లి, మే 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం కూరగాయల ధరలు పతనమయ్యాయి. సోమవారం మినహా ప్రతి రోజూ కూరగాయలను రైతులు మార్కెట్‌కు తీసుకువస్తారు. ఆదివారం బరబాటి, బెండ ధరలుతగ్గి పోయాయి. బెండకాయలను ఎవరూ కొనుగోలు చేయకపోవడంతో కొంత మంది రైతులు మిగిలిన బెండ కాయలు కాలువల్లో, రోడ్డు పక్కన పారబోశారు. బెండ గత వారం కొనుగోలు చేయక రోడ్డుపై పడేసిన విషయం తెలిసిందే. ఆదివారం క్రేటు రూ.15 దాటి కొనుగోలు చేయలేదు. టన్నుల కొలది కూరకాయలు రావడంతో వ్యాపారులు సరిపడా కొనుగోలు చేసుకున్నారు. బరబాటి పది కిలోలు రూ.60 అమ్ముడుపోయింది. వంకాయలు (నల్లవి) క్రేటు (15 కిలోలు) రూ250 నుంచి 300 వరకు అమ్మింది. తెల్ల వంకాయలు క్రేటు (15 కిలోలు) రూ.200 నుంచి రూ.250కు ధర పలికాయి.

రైతుల పరిస్థితి దయనీయంగా మారుతున్నది

-కడారి నాయుడు, నాగయ్యపేట



కూరకాయలు రైతుల పరిస్థితి దయనీయంగా మారుతోంది. ఎప్పుడు ఏ కూరగాయ ధర పతనమవుతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. ప్రధానంగా కోల్డ్ స్టోరేజీ లేకపోవడం ఒక కారణం కాగా, 70 శాతం రైతులు కూరకాయల పంటలపైన ఆధారపడి బతుకున్నాం. ఈ ఏడాది పెట్టుబడులు కూడా రావడం లేదు. సరికదా అప్పులు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

హైడ్రో పవర్ ప్లాంటు పనులను అడ్డుకుంటాం

- విల్లంబులతో వినూత్న నిరసన



విల్లంబులు పట్టుకుని నిరసన తెలుపుతున్న గిరిజనులు

దేవరాపల్లి, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలపూడి పంచాయతీ పరిధిలో చేపట్టబోయే హైడ్రో పవర్ ప్లాంటు పనులను అడ్డుకుంటామని గిరిజనులు స్పష్టం చేశారు. ఈ మేరకు ఆదివారం విల్లంబులు పట్టుకుని వినూత్నంగా నిరసన తెలిపారు. అనంతరం సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి.వెంకన్న మాట్లాడుతూ అదాని లూప్ పంప్ స్టోరేజీ పవర్ ప్లాంటు కోసం ఇచ్చిన నోటిఫికేషన్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఈశ్వరరావు, ఎర్నాయుడు పాల్గొన్నారు.

మోదకొండమ్మ సారె ఉరేగింపు

మాడుగుల, మే 4 (ఆంధ్రజ్యోతి): మండల ప్రజల ఇలవేల్పు మెదకొండమ్మ అమ్మవారి సారెను ఆదివారం ఘనంగా ఊరేగించారు. గ్రామంలోని మహిళలు పలు రకాల పిండి వంటలతో ఉరేగింపుగా వెళ్లి సతకం పట్టు వద్ద కొలువై ఉన్న అమ్మవారికి సమర్పించారు, ఈకార్యక్రమమలో మాడుగుల మండల వాసవీ కుటుంబ సభ్యులు, ఆర్య వైశ్య కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు, ఆర్య వైశ్య సంఘం ఉపాధ్యక్షుడు కె.భాస్కరరావు, జిల్లా ఆర్య వైశ్యుల ఉపాధ్యక్షుడు శ్రీనాద్ శ్రీనివాసరావు, మాడుగుల మండల వాసవి వనితలు, ఆర్య. వైశ్య కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారి సారెతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

నేడు చోడవరంలో మినీ మహానాడు

చోడవరం, మే 18 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రంలో సోమవారం మినీ మహానాడు నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు తెలిపారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు సూచన మేరకు లక్ష్మమ్మ కోవెల ప్రాంగణంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. నాయకులు, కార్యకర్తలు మహానాడును విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు.

మాడుగులలో...

మాడుగుల రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి) ఘాట్ రోడ్డు జంక్షన్‌లోని చెరకు కాటా వద్ద సోమవారం మినీ మహానాడు నిర్వహిస్తున్నట్టు టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు అద్దెపల్లి జగ్గారావు, గుంటూరు దేముడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో ఉదయం పది గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండారు అప్పలనాయుడు, పలువురు ప్రముఖులు హాజరవుతారని చెప్పారు. నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

22న మరిడిమాంబ పండుగ

కృష్ణాదేవిపేట, మే 18 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం కొంగసింగి గ్రామంలో ఈ నెల 22న మరిడిమాంబ అమ్మవారి పండుగ నిర్వహించనున్నట్టు సర్పంచ్ యలమంచిలి నూకరత్నం, టీడీపీ నేత యలమంచిలి వరహాలబాబు, తెలిపారు. ఇందుకోసం ఆలయాన్ని ముస్తాబు చేస్తున్నట్టు చెప్పారు. ఆ రోజు వేకువజాము నుంచి అమ్మవారికి పసుపు, కుంకుమలతో భక్తులు పూజలు చేయడానికి మొక్కులను తీర్చుకునేందుకు వీలుగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అలాగే మధ్యాహ్నం జిల్లాస్థాయి ఎడ్ల బండ్ల పరుగు పోటీలు నిర్వహిస్తామన్నారు. రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు.

ఉత్సాహంగా ఎడ్ల పరుగు పోటీలు

చీడికాడ, మే 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మోదమాంబ అమ్మవారి పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు మధ్యాహ్నం భారీ అన్నసమారాధన జరిగింది. సాయంత్రం 4 గంటలకు ప్రారంభమైన జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పోటీల్లో 16 జతల ఎడ్లు పాల్గొనగా, వీరిలో వి.పైడితల్లమ్మ ఎల్‌వి.పాలెం ఎద్దులకు ప్రథమస్థానం వచ్చింది. అలాగే రెండో స్థానంలో సిద్ధివినాయక లక్కవరం, మూడో స్థానంలో కోడి నాగతేజ ముద్దుర్తి, నాలుగో స్థానంలో బండారు చరణ్‌హర్ష, కేఎల్‌బీ.పట్నం, 5, 7వ బహుమతులు వావిలపాడు గ్రామానికి చెందిన ఎద్దులకు దక్కాయి. ఆరో స్థానం మురుకుర్తి హరికృష్ణ చుక్కపల్లి ఎద్దులకు దక్కాయి. దాతలు ఏర్పాటు చేసిన బహుమతులను ఎస్ఐ పి.సతీష్, ఆలయ కమిటీ సభ్యులు బొడ్డు మహాలక్ష్మినాయుడు, బొడ్డు శ్రీనివాస్, వంటాకు గోవింద అందజేశారు.

జి.కొత్తపల్లి మాజీ సర్పంచ్ మృతి

చీడికాడ, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో జి.కొత్తపల్లి గ్రామ మాజీ సర్పంచ్ బండారు తాతబాబు (70) అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం సాయంత్రం విశాఖలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. 1981లో సర్పంచ్‌గా ఎన్నికైన ఆయన 1983లో తెలుగుదేశం పార్టీలో చేరారు. 1995లో మరోమారు సర్పంచ్‌గా, ఎంపీటీసీ సభ్యుడుగా, నీటి సంఘం అధ్యక్షుడిగాను, చీడికాడ పీఏసీఎస్ డైరెక్టర్‌గా పనిచేసిన ఆయన మాజీ మంత్రి రెడ్డి సత్యనారాయణ మృతి చెందే వరకూ ఆయన ప్రధాన శిష్యుడిగానే ఉన్నారు. సోమవారం స్వగ్రామంలో అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు విలేకరులకు తెలిపారు.

'రూ.15 లక్షలు భద్రంగానే ఉన్నాయి'

బుచ్చెయ్యపేట, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డాదిలో ఇసుక తవ్వకాల్లో అవినీతి జరగలేదని జనసేన నేత అడపా నరసింహమూర్తి స్పష్టం చేశారు. ఆదివారం వడ్డాదిలో సయ్యపురెడ్డి సత్యనారాయణతో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి రూ.15 లక్షలను ప్రదర్శించారు. ఇటీవల సినీ నిర్మాత నట్టి కుమార్ అవగాహన రాహిత్యంతో తమపైన, జనసేన పార్టీపైన ఆరోపణలు చేశారని ఆయన పేర్కొన్నారు.

రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తుతెలియని మృతదేహం

కశింకోట, మే 18 (ఆంధ్ర జ్యోతి): మండలం లోని నర్సింగబిల్లి- బయ్యవరం రైల్వే స్టేషన్ మధ్య పట్టాలపై గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్టు తుని రైల్వే పోలీసులు ఆదివారం తెలిపారు. తుని నుంచి అనకాపల్లి వైపు వెళ్లే రైలు బండిలో ప్రయాణిస్తుండగా జారిపడి మృతి చెంది ఉంటాడని అను మానం వ్యక్తం చేస్తున్నారు. కాగా మృతుడికి 30 ఏళ్ల వయస్సు ఉంటుందని, నీలం రంగు ఆఫ్ చేతుల టీషర్టు ధరించి ఉన్నాడని వివరించారు. టీ షర్టుపై ఓ సిమెంటు కంపెనీ పేరు రాసి ఉందని, నలుపు రంగు జీన్ ఫ్యాంటు ధరించి ఉన్నాడని పేర్కొన్నారు. ఇంతకు మించి మృతుడికి సంబంధించి ఎటువంటి ఆధారాలు లభించలేదన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి తుని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో మృతదేహాన్ని భద్రపరిచామని ఎస్ఐ జి.శ్రీనివాసరావు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 94906 19020 నంబరులో సంప్రదించాల్సిందిగా కోరారు.

చికిత్స పొందుతూ కార్మికుడు..

కశింకోట, మే 18 (ఆంధ్రజ్యోతి) : ఓ కాంట్రాక్టు కార్మికుడు విశాఖలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ లక్ష్మణరావు తెలిపిన వివరాలివి. మాడుగుల మండలం వంటర్లపాలెం గ్రామానికి చెందిన సిహెచ్.శంకరరావు (45) ఏపీ ఈపీడీసీఎల్ పరిధిలో కాంట్రాక్టు కార్మికుడుగా పని చేస్తున్నాడు. ఏప్రిల్ 12న విధి నిర్వహణలో భాగం గా కశింకోట మండలం తేగాడ గ్రామంలో విద్యుత్ స్తంభం ఎక్కి పనిచేస్తుండగా షాక్ గురై కిందపడిపోయాడు. తీవ్ర గాయాలకు గురైన అతడు అప్పటి నుంచి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్టు అతని సోదరుడు నూరిబాబు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.

పశుసంవర్ధక శాఖ బదిలీల్లో ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించాలి



మాట్లాడుతున్న సంఘ జిల్లా అధ్యక్షులు గణేశ్వరరావు, పక్కనే తిరుపతి, అనకాపల్లి జిల్లాల అధ్యక్షులు

అనంతగిరి, మే 18 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల బదిలీల్లో ప్రభుత్వ మార్గదర్శకాలను అధికారులు కచ్చితంగా పాటించాలని జిల్లా పశువైద్యాధికారుల సంఘం అధ్యక్షుడు సాగిరి గణేశ్వరరావు డిమాండ్ చేశారు. మండలంలోని ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుడారు. పశు సంవర్ధకశాఖ విడుదల చేసిన నిబంధనలు ప్రకారమే బదిలీ చేపట్టాలని కోరారు. కౌన్సెలింగ్ పద్ధతిలో సినియార్టీ ప్రతిపాదికన రాజకీయ పైరవీలు లేకుండా పారదర్శకంగా బదిలీలు నిర్వహించాలన్నారు. గిరిజన ప్రాంతంలోని పనిచేస్తున్న ఉద్యోగులకు మైదాన ప్రాంతానికి, మైదాన ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను గిరిజన ప్రాంతాలకు బదిలీ చేయాలన్నారు. గిరిజన ప్రాంతంలో పని చేస్తున్న ఉద్యోగులకు ప్రతిసారి బదిలీలలో తీవ్ర అన్యాయం జరుగుతుందని, ఈసారి నిబంధనలు ప్రకారమే బదిలీలు చేపట్టాలని కోరారు. అలాగే ఉద్యోగి ఆరోగ్య పరిస్థితి ఆధారంగా బదిలీల్లో వెసులుబాటు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలోని ఉద్యోగి తిరుపతి, అనకాపల్లి జిల్లాల పశువైద్యాధికారుల సంఘం అధ్యక్షులు శివ రామకృష్ణారావు, ఎల్. రమేష్ పాల్గొన్నారు.

వాలీబాల్ విజేత గొర్రెగుమ్మి జట్టు



విజేత జట్టుకుఉ నగదు అందిస్తున్న వైస్ ఎంపీపీ, వైసీపీ నాయకులు

అనంతగిరి, మే 18 (ఆంధ్రజ్యోతి): గిరిజన క్రీడాకారుల ప్రతిభను గుర్తించి తగిన ప్రాధాన్యమివ్వాలని స్థానిక వైస్ ఎంపీపీ దూరు జయవర్ధిని అన్నారు. మండలంలోని లంగుపర్తి పంచాయతీ చీడివలసలో క్రిష్ సామ్యేల్ సంస్థ ఆధ్వర్యంలోని వాలీబాల్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వైస్ ఎంపీపీ, అరకు అసెంబ్లీ వైసీపీ ఎస్టీసెల్ అధ్యక్షులు ఆర్.స్వామి పాల్గొని మాట్లాడారు. అనంతరం టోర్నమెంట్‌లోని విజేతగా నిలిచిన గొర్రెగుమ్మి వాలీబాల్ జట్టుకు రూ.10వేలు, రెండో బహుమతి వాకపల్లికి రూ.5వేలు,మూడో బహుమతి చీడివలసకు రూ.3వేలు అందించారు. ఈ కార్యక్రమంలో స ర్పంచ్ సన్యాసిరావు, జడ్పీటీసీ మాజీ సభ్యులు దూరు గంగన్నదొర, వైసీపీ మండల అధ్యక్షుడు సూర్యానారాయణ, తదితరులు పాల్గొన్నారు.


సాయినగర్‌లో రూ.10 లక్షలతో రక్షిత నీటి పథకం



బోర్‌వెల్‌కు శంకుస్థాపన చేస్తున్న జడ్పీటీసీ సభ్యుడు బాలయ్య, సర్పంచ్ పుష్పలత

చింతపల్లి, మే 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాయినగర్‌లో తాగు నీటి సమస్య పరిష్కరించేందుకు రూ. 10 లక్షల జడ్పీ నిధులతో రక్షిత మంచి నీటి పథకం నిర్మిస్తున్నట్టు జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య తెలిపారు. ఆదివారం స్థానికంగా బోర్‌వెల్ నిర్మాణానికి జెడ్పీటీసీ, సర్పంచ్ దురియా పుష్పలతతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా జడ్పీటీసీ సభ్యుడు మాట్లాడుతూ జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి శుభద్ర చొరవతో తాగునీటికి నిధులు కేటాయించినట్టు చెప్పారు. మండలంలో ఈ నిధులతో 20 బోర్‌వెల్స్ నిర్మించామన్నారు. చింతపల్లిలో సీపీడబ్ల్యూ పథకం ద్వారా పలు వీధులకు నీటి సరఫరా జరుగుతున్నా సాయినగర్‌లో సమస్య ఉంటోందన్నారు. ఈ నేపథ్యంలో సాయినగర్‌కి ప్రత్యేకంగా తాగునీటి పథకం నిర్మిస్తామన్నారు. రామాలయం వీధిలో తాగునీటి పథకం ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు దాసరి ధారమల్లేశ్వరి పద్మ కోఆప్షన్ సభ్యుడు నాజర్‌వల్లి, మాజీ వైస్ ఎంపీపీ బూసరి కృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ స్వర్ణలత, జీసీసీ ఉద్యోగుల సంఘం నాయకుడు హేమంత్ కుమార్ పాల్గొన్నారు.

టేబుల్ టెన్నిస్‌లో ప్రతిభ



జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి అందుకుంటున్న మోహితాక్షిత

సీలేరు, మే 18 , (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం సీలేరులో ఏపీ జెన్‌కోలో జేఏఓగా పనిచేస్తున్న ఎం. జోగారావు కుమార్తె మోహితాక్షిత జిల్లాస్థాయి అండర్-13 టేబుల్ టెన్నిస్‌లో ప్రథమ స్థానంలో నిలిచింది. ఇటీవల విశాఖపట్నంలో టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ (వీడీ టీటీఏ) ఆ. ధ్వర్యంలో జిల్లాస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలను నిర్వహించారు. ఇందులో అండర్ -13 విభాగంలో మోహితాక్షత పాల్గొని తన సత్తాచాటింది. ఫైనల్స్‌లో సాన్వికతో తలపడి 3-1 సెట్ స్కోర్‌తో గెలుపొంది ప్రథమ స్థానం లో నిలిచింది. ఈ బాలిక విశాఖలో ఓ పాఠశాలలో 5 వ తరగతి పూర్తి చేసింది. స్థానిక జెన్‌కో ఉద్యోగులు, ఇంజినీర్లు తండ్రి జోగారావు, కుమార్తెను అభినందించారు. జోగారావు టే బుల్ టెన్నిస్ క్రీడాకారుడు. జెన్‌కో రాష్ట్ర స్థాయిలో జరిగిన పలుమార్లు విజేతగా గెలుపొందారు. మోక్షితాక్షితను పలువురు అభినందించారు.



గుడివాడవీధిలో కాలువలోనుంచి రహదారిపైకి వస్తున్న మురికి నీరు



లోచలిపుట్టువీధిలో జలమయమైన రహదారి

చినుకుపడితే చిత్తడే...

- పాడేరులో అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ
- వీధుల్లో మురుగునీరు
- పట్టణ వాసులు అవస్థలు

పాడేరు రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన పాడేరు పట్టణం చినుకుపడితే చిత్తడిగా మారుతోంది. సైడ్ కాలువలు ఆక్రమణలకు గురికావడం, కాలువలను షాపుల యజమానులు పలకలతో మూసేస్తున్నారు. దాంతో చిన్నపాటి వర్షం కురిసినా కాలువల్లోని వాడుక నీరు, వర్షం నీరు ప్రధాన రహదారులపై వచ్చి ప్రవహిస్తోంది. దీంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందికి గురవుతున్నారు. మురికి కాలుపై ఆక్రమణలను గతంలో జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో పంచాయతీ సర్పంచ్ కొట్టగుళ్లి ఉషారాణి, పంచాయతీ పాలక వర్గ సభ్యుల పర్యవేక్షణలో తొలగించినా, వ్యాపారులు మళ్లీ యథావిధిగా తీసుకువస్తున్నారు. దీంతో పట్టణ ప్రజలు వర్షం పడిన ప్రతిసారీ మురుగునీటిలో నడవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. గుడివాడవీధిలో మురికికాలువ నుంచి బురద నీరు ప్రధాన రహదారిపై నుంచి ప్రవహించడంతో దుర్గంధం మధ్యనుంచే పాదచారులు నడవాల్సి వస్తోంది. అదే విధంగా పట్టణంలోని పలువీధుల్లో ప్రధాన రహదారులు జలమయంగా మారుతున్నాయి.

అధికారులు ఇప్పటికైనా స్పందించి ఆక్రమణలు తొలగించి పారిశుద్యం మెరుగుపర్చాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

కిటకిటలాడిన మోదకొండమ్మ ఆలయం



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పాడేరురూరల్, మే 18 (ఆంధ్ర జ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం పాడేరు మోదకొండమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈ నెల 11వ తేదీ నుంచి 13వ తేదీ వరకు మూడు రోజులు అమ్మవారి ఉత్సవాలు జరిగిన నేపద్యంలో భక్తుల రద్దీ వల్ల మొక్కులు చెల్లించని మన్యంలోని వివిధ ప్రాంతాల భక్తులతో పాటు మైదాన ప్రాంతాలకు చెందిన భక్తులు ఆదివారం ఆలయానికి చేరుకొని అమ్మవారికి ఘటాలను సమర్పించారు. ప్రత్యేక పూజలను చేపట్టారు. ఆలయ ప్రాంగణంలో కుటుంబ సభ్యులు, బంధు మిత్రులతో కలిసి పండగలను జరుపుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రసాదం పంపిణీ చేశారు. పాడేరు ఘాట్‌లోని మోదాపల్లి జంక్షన్ వద్ద గల అమ్మవారి పాదాల వద్ద మొక్కులు తీర్చుకొనేందుకు మైదాన ప్రాంత భక్తులు వందల సంఖ్యలో హాజరయ్యారు. ఆలయ సమీపంలోని కాఫీ తోటల్లో ఆనందంగా గడిపారు.

ఘనంగా మోదకొండమ్మ ఉత్సవాలు ప్రారంభం



ఆకర్షణీయంగా పెదబయలులో విద్యుత్ దీపాల అలంకరణ

పెదబయలు, మే 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మోదకొండమ్మ ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారిని అరకు ఎంపీ తనూజారాణి, ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బొంజుబాబు ఆధ్వర్యంలో ఉత్సవ విగ్రహం, పాదాలు, ఘటాలను మోశారు. ఆలయం నుంచి డప్పు వాయిద్యాలమధ్య ప్రధాన రహదారిలో ఏర్పాటు చేసినా సతకం పట్టు వద్దకు ఘటాలను చేర్చారు. అనంతరం వాటిని అక్కడ ప్రతిష్ఠించి అమ్మవారి మూడు రోజుల ఉత్సవాలను ప్రారంభించారు. అలాగే సాయంత్రం ఘటాలను వీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యుత్ అలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జీ.మాడుగుల సీఐ శ్రీనివాస్, పెదబయలు ఎస్‌ఐ రమణ పర్యవేక్షణలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.

ఆర్వీనగర్- పాలగెడ్డ రోడ్డు సమస్యకు పరిష్కారం చూపాలి



అధ్వాన్న స్థితిలో రహదారి

సీలేరు, మే 18 , (ఆంధ్ర జ్యోతి): పాడేరులో ఈ నెల 19 న జరిగే తెలుగుదేశం పార్టీ మినీ మహానాడులో జీకేవీధి మండలం ఆర్వీనగర్ నుంచి వై రామవరం మండలం పాలగెడ్డ వరకు గల అంత ర్రాష్ట్ర రహదారి దుస్థితిపై అధికార పార్టీ నాయకులు ప్రస్తావించి నిర్మాణ పనులు ప్రారంభ మయ్యేలా చూడాలని డీసీసీ కార్యదర్శి కారే శ్రీనివాస్ కోరారు. మినీ మహానాడులో జిల్లాకు సంబంధించిన ప్రధాన సమస్యలపై చర్చకు వచ్చిన సమయంలో ఈ రహదారి పరిస్థితిని దృష్టికి తేవాలని కోరారు. దీంతో ముఖ్యమంతి చంద్రబాబునాయుడు దృష్టికి ఈ సమస్య వెళ్లి ఈప్రాంతీయుల కష్టాలు తీరుతాయని ఆయన ఈ సందర్భంగా అభిప్రాయం వ్యక్తంచేశారు.

ఏజెన్సీలో ఉద్యోగ నియామక చట్టం కోసం గవర్నర్‌కు లేఖ



ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజుకు లేఖ అందిస్తున్న నాయకులు

పాడేరురూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డ్ ప్రాంతంలో ఉద్యోగ నియామకాల చట్టం చేయాలంటూ పాడేరు, అరకు ఎమ్మెల్యేల ద్వారా గవర్నర్, ముఖ్యమంత్రికి ఆదివారం లేఖలు పంపించినట్టు ఏపీ ఆదివాసీ సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ రామారావు దొర తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ షెడ్యూల్ ప్రాంత ఉపాధ్యాయ పోస్టులను 2025 మెగా డీఎస్సీ నోటిఫికేషన్ నుంచి మినహాయించి ఏజెన్సీకి ప్రత్యేక నోటిఫికేషన్ ఇవ్వాలన్నారు.అల్లూరి జిల్లా ఆదివాసీ శాసన సభ్యులైన పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు, అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవిలను కలిసిన జేఏసీ బృంద సభ్యులు వారికి లేఖలను అందించి వారి ద్వారా గవర్నర్, ముఖ్యమంత్రికి పంపించాలని కోరామన్నారు. పాడేరు, రంపచోడవరం, చింతూరు, కేఆర్ పురం, పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏ ప్రాజెక్టు అధికారుల ద్వారానూ ప్రభుత్వానికి తెలియజేశామని ఆయన తెలిపారు. ప్రభుత్వం సమస్యలు పరిష్కరించడంలో అలసత్వం వహిస్తే ఆదివాసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. ఈకార్యక్రమంలో గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.శేషాద్రి, బి.సింహాచలం, ఎస్టీ ఎంప్లాయీస్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం .ప్రసాదరావు, వివిధ సంఘాల నాయకులు ఎల్.వెంకటరమణదొర,ఎం.ఈశ్వరరావు, టి.సురేశ్‌బాబు, పి.సురేశ్‌కుమార్, ఎం.వెంకటరమణ, బి. నాగరాజు పాల్గొన్నారు.

చెట్టు మొదలులోనే పనసకాయలు



సీలేరులో చెట్టు కాండంపై కాసిన పనసకాయలు

సీలేరు, మే 17 , (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో సీజన్ ప్రారంభం కావడం తో పనసపండ్ల ఫలసాయం అందుబాటులోకి వస్తుంది. అయితే, సహజంగా ఈ పనసపండ్లు చెట్టుపై భాగంలోనే కాస్తుంటాయి. కానీ, జీకేవీధి మండలం సీలేరు మార్కెట్ సెంటర్‌లో బి. యాకోబ్ అనే వ్యక్తి ఇంటి ఆవరణలోని చెట్టుకు మొదల భాగంలో కాయలు కాస్తుడంతో స్థానికులు ఆసక్తిగా తిలకిస్తున్నారు. ఈ ప్రాంతలో ఏ చెట్టుకు ఇలా మొదలు భాగంలో పనసకాయలు కాయలేదని చెబుతున్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- ఒకరి మృతి
- ఇద్దరికి తీవ్ర గాయాలు



మృతుడు చంద్రరావు(ఫైల్)

చింతపల్లి, మే 18 (ఆంధ్రజ్యోతి): లంబసింగి- చింతపల్లి ప్రధాన రహదారి రౌరింతాడ గ్రామంలో ఓ ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందగా, అతని భార్య, మరో బాలుడు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు, బాధితుల కథనం ప్రకారం వివరాలిలా వున్నాయి. ఆదివారం మధ్యాహ్నం పెంటపాడు గ్రామానికి చెందిన మెకానిక్ చంద్రరావు(38), అతని భార్య కృష్ణవేణి, అన్నకొడుకు అఖిలేశ్ ద్విచక్ర వాహనంపై చిట్రాళ్లగొప్పు గ్రామంలోని ఓ విందు కార్యక్రమానికి వెళ్లారు. సాయంత్రం స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. రౌరింతాడ బస్ షెల్టర్ మలుపు వద్ద ఎదురుగా వస్తున్న భద్రాచలం ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ ఆ ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. దీంతో చంద్రరావు సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. అతని భార్య కృష్ణవేణి, అఖిలేశ్ ఐదు మీటర్ల దూరంలో రహదారి పక్కన ఎగిరి పడ్డారు. దీంతో వారిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వారిని అంబులెన్సులో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు.



రహదారి పక్కన పడిపోయిన కృష్ణవేణి, అఖిలేశ్

అలంకారప్రాయంగా బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్లు

- కొయ్యూరు మండలంలో సిగ్నల్స్ రాక నెలల తరబడి ఇబ్బందులు
- నిర్వహణను గాలికి వదిలేసిన అధికారులు

కొయ్యూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సమాచార వ్యవస్థను మెరుగు పరిచేందుకు బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్లను ఏర్పాటు చేశారు. అయితే, ఇవి సరిగా పనిచేయక వినియోగదారులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. తరచూ సెల్ సిగ్నల్స్ సమస్య తలెత్తుతోంది. వీటిని తిరిగి సంబంధిత అధికారులు పునరుద్ధరించిన రోజుల వ్యవధిలోనే అవి మామూలవుతున్నాయి. మండలంలో బాలారం ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల ఎదురుగా, కొత్తపాడి, బూదరాళ్ళ, మండల కేంద్రమైన కొయ్యూరు, మంప, శరభన్నపాలెం, తదితరచోట్లతోపాటు మరో 15 టవర్లు సాంకేతిక పరమైన సమస్యతో సిగ్నల్స్ రాక వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఈ టవర్లన్నీ ప్రారంభించిన కొద్దిరోజులకే మూలకు చేరాయి. దీంతో వినియోగదారులు నష్టపోతున్నారు. ప్రతి నెలా రీచార్జి డేటా వేసుకుంటున్నా, ఫోన్లు పనిచేయక డబ్బు వృథా అవుతోందని పలువురు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.ఫిర్యాదు చేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయా గ్రామాల వారు ఆందోళనకు సిద్ధమవుతున్నారు.

ధర్మాపురంలో మూగనోము..

సీలేరు: జీకేవీధి మండలం ధారకొండ పంచాయతీ పరిధిలోని ధర్మాపురంలో బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ గత రెండు వారాలుగా పనిచేయకపోవడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇన్ని రోజులుగా సెల్ టవర్ పనిచేయకున్నా సిబ్బంది ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని వారు ఆరోపిస్తున్నారు. దీంతో అత్యవసర సమయాల్లో ఆసుపత్రికి అంబులెన్సుకు ఫోన్ చేయాలన్నా, దూరప్రాంతాల్లో ఉన్న తమ బంధువులతో మాట్లాడాలన్నా వీలుకావడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు సంబంధిత అధికారులు ఇకనైనా స్పందించి బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ వినియోగంలోకి తీసుకురావాలని



కొయ్యూరు మండలం బాలారంలో వృథాగా బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్



ధర్మాపురంలో రెండు వారాలుగా పనిచేయని టవర్

సమష్టిగా ఎయిడ్స్‌ను పారదోలాలి: డీఎంహెచ్‌వో



స్మారక దినం ప్రదర్శనలో పాల్గొన్న డీఎంహెచ్‌వో జమీల్‌బాషా, వైద్య సిబ్బంది

పాడేరురూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ఎయిడ్స్ దీప స్మృత్యాంజలి స్మారక దినాన్ని నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (ఎన్ఏసీఓ) ఆధ్వర్యంలో పాడేరులో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో షేక్ జమీల్ బాషా మాట్లాడుతూ.. 1983లో మేలో మూడో ఆదివారం ఈ స్మృత్యాంజలి స్మారక దినం ప్రారంభమైందన్నారు. అప్పటినుంచి ఏటా ఈ రోజున హెచ్ఐవీ/ఎయిడ్స్‌తో చనిపోయిన వారిని 'గుర్తించుకుంటాం, మేము మాట్లాడుతాం, మేము నడిపిస్తాం' అనే నినాదంతో ఈ స్మారక దినాన్ని జరుపుకుంటున్నామన్నారు. రాష్ట్రంలో హెచ్ఐవీ/ఎయిడ్స్‌తో గత 20 ఏళ్లలో వేల మంది మృతి చెందారన్నారు. ప్రస్తుతం 2,26,703 మంది మందులు వాడుతూ సంపూర్ణ ఆరోగ్యంగా జీవిస్తున్నారన్నారు. వారికి ఉచిత వైద్య చికిత్సలు, మందులు రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ద్వారా అందిస్తున్నామన్నారు. జిల్లాలో 677 మంది హెచ్ఐటీ/ఎయిడ్స్‌తో ఉండగా వారిలో 542 మంది ఏఆర్‌టీ మందులు వాడుతున్నారని తెలిపారు. అనంతరం జిల్లా ఆస్పత్రి నుంచి అంబేడ్కర్ కూడలి వరకు కొవ్వొత్తుల ర్యాలీని చేపట్టారు. ఈ కార్యక్రమంలో జీజీహెచ్ఆర్ఎంవో వెంకట్, వైద్యాధికారులు విజయకుమారి, హరిప్రియ, ఆరోగ్య విస్తరణాధికారి జి.సింహాద్రి, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఉద్యోగులు సీపీఎం రామచందర్, డీఎండీవో చిరంజీవి, ఐసీటీసీ కౌన్సిలర్ మధుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

'గిరిజన గ్రామాల్లో సదుపాయాల కల్పనలో విఫలం'



బంధవీధిలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న గిరిజనులు

సీలేరు, మే 15 , (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు గడుస్తున్నా మారుమూల గిరిజన ప్రాంతాల్లో కనీస మౌలిక సదుపాయాలకు నోచుకోలేదని మర్రి కామయ్య ఆదిమజాతుల సేవా సంఘం జిల్లా కార్యదర్శి సీహెచ్ అశోక్ అన్నారు. ఆదివారం జీకేవీధి మండలం దుప్పులవాడ పంచాయతీ బంధవీధిలో ధారకొండ, గుమ్మిరేవుల, దుప్పులవాడ పంచాయతీలకు చెందిన గిరిజనులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో తాగునీటి సమస్య, రహదారి, పాఠశాల భవనాలు, అంగన్‌వాడీ భవనాలు తదితర కనీస సదుపాయాలు కూడా లేక గిరిజనులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, అన్ని ప్రభుత్వ శాఖల అధి కారులు ఈ ప్రాంతాన్ని స్వయంగా సందర్శిస్తే సమస్యలు స్వయంగా తెలుస్తాయన్నారు. జిల్లా కలెక్టర్ ఈప్రాంతాల గిరిజన గ్రామాల నివేదికను తెప్పించుకుని మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి మండలం జనసేన పార్టీ అధ్యక్షుడు వంతల బుజ్జిబాబు, పెదవలస సర్పంచ్ వంశీకృష్ణ , మర్రి కామయ్య ఆదిమ జా తుల సేవా సంఘం సభ్యులు కె జగన్, కె బాలయ్య, పి కృష్ణ, సురేశ్, పరమేశ్ తదితరలు పాల్గొన్నారు.

సంఘాల ముసుగులోని దోపిడీదారులకు అడ్డుకట్ట

- డీఎల్‌వో రాష్ట్ర ముఖ్యకార్యదర్శి కొండపల్లి కాంతారావు

పాడేరురూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంఘాల ముసుగులో ఉన్న దోపిడీదారుల భరతం పడతామని డీఎల్‌వో రాష్ట్ర ముఖ్యకార్యదర్శి కొండపల్లి కాంతారావు, జిల్లా అధ్యక్షుడు కిముడు కొత్తయ్య ఆదివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. టీడబ్ల్యూ ఇన్‌చార్జి డీడీ రజని అవినీతి, అక్రమాలకు పాల్పడుతూ పాఠశాలల పరిపాలనను అస్తవ్యస్తం చేస్తున్నా ఆమెను వెనకేసుకుని వస్తున్న ఉపాధ్యాయ సంక్షేమ సంఘం తీరును ఖండిస్తున్నట్టు తెలిపారు. గత జనవరి 9న కలెక్టర్‌తో డీఎల్‌వో, డీఈవో, డీఎస్‌వో మిత్ర సంఘాలు చర్చించి అవినీతి అధికారులపై లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశామన్నారు. డీడీ రజిని, సూపరింటెండెంట్ శ్రీనివాస్ రెడ్డిపై ఏసీబీ, సీబీఐ విచారణకు డిమాండ్ చేస్తున్నామన్నారు. డీడీ రజినిపై రాష్ట్ర అధికారులు చర్యలకు ఉప క్రమిస్తుంటే ఆమె నిజాయతీపరురాలంటూ కరపత్రం విడుదల చేయడం సరికాదని గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయ సంఘ నాయకులు ఖండించడాన్ని డీఎల్‌వో తీవ్రంగా పరిగణిస్తుందన్నారు. గిరిజన సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి ఎం ఎం.నాయక్, డైరెక్టర్ భార్గవి, సీఎంవో ముఖ్యకార్యదర్శి కార్యాలయానికి ఫిర్యాదు చేసి చర్చించామన్నారు. స్పందించిన అధికార యంత్రాంగం ఇప్పటికే చింతపల్లి తహసీల్దార్‌పై చర్యలు చేపట్టిందన్నారు. గిరిజన ప్రాంతంలో నూటికి నూరు శాతం ఉద్యోగాలు కల్పించాలనే డిమాండ్‌తో పోరాటాలు జరుగుతున్నా గిరిజనేతర అధికారులను వెనకేసుకురావడం దేనికి సంకేతమని వారు ప్రశ్నించారు. కొంత మంది ఎస్‌జీటీలుగా ఉన్నా నకిలీ సర్టిఫికెట్లతో పదోన్నతులు పొంది అర్హులైన ఆదివాసీ ఉపాధ్యాయులను మోసగిస్తునట్టు ఆయన ఆరోపించారు.

నరకప్రయాణం

... 5వ పేజీ తరువాయి

జంక్షన్ నుంచి చోడవరం వైపు తుమ్మపాల గ్రామం దాటే వరకు సుమారు మూడు కిలోమీటర్ల మేర రోడ్డు మొత్త ం ఛిద్రమైంది. ఇంకా మార్టూరు జంక్షన్, దర్శీనగర్, ఊడేరు, మామిడిపాలెం, ముద్దుర్తి వద్ద భారీ గోతులు ఏర్పడ్డాయి. దర్శీనగర్ వద్ద దాదాపు కిలోమీటరు మేర తారురోడ్డు ఆనవాళ్లు లేకుండా పోయింది. కొద్ది రోజుల నుంచి అడపాదడపా కురుస్తున్న వర్షాలకు గోతుల్లో నీరు చేరి, రోజుల తరబడి నిలిచిపోతున్నది. ఈ రోడ్డులో రాత్రి పూట వీధి దీపాలు వెలగకపోవడంతో ద్విచక్ర వాహనదారులు గోతుల వద్ద ప్రమాదాలకు గురవుతున్నారు. గర్భిణులు, వృద్ధులు, ఆస్పత్రికి వెళ్లే రోగులు ఆటోల్లో ప్రయాణిస్తున్నప్పుడు కుదుపులతో చాలా ఇబ్బంది పడుతున్నారు.

మెడికల్ సర్టిఫికెట్ల మాయాజాలం!

... 5వ పేజీ తరువాయి

మంచి స్థానాలు పొందే అవకాశాన్ని కొందరు కోల్పోయారు. ఈ పర్యాయం బదిలీల్లో ఒక పాఠశాలలో 50 శాతానికి మించి ప్రాధాన్యత కేటగిరీలో టీచర్లు రాకుండా ప్రభుత్వం ఆంక్షలు విధించింది. దీంతో నగరం, పరిసరాల్లో పలు పాఠశాలలకు ఇతర కేటగిరీ టీచర్లు రానున్నారని విద్యాశాఖ వర్గాలు తెలిపాయి.

లీగల్ మెట్రాలజీ దాడులు

... 5వ పేజీ తరువాయి



మటన్ దుకాణంపై కేసు రాస్తున్న గాజువాక ఇన్‌స్పెక్టర్ ఉమసుందరి

తక్కెట కాటాలు ఏడు, ఎలక్ట్రానిక్ కాటాలు రెండు, కౌంటర్ కాటాలు ఆరు వున్నాయి. తక్కువ తూకంతో వినియోగదారులను మోసగించే వ్యాపారులపై నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని అసిస్టెంట్ కంట్రోలర్ బి.రామచంద్రయ్య తెలిపారు. ప్రతి తూకం యంత్రానికి తమ శాఖ వేసిన సీల్ తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. తనిఖీల్లో సిబ్బంది లీలా శ్రీనివాస్, ఎస్.కె.బాజీ, కృష్ణతులసి పాల్గొన్నారు.

మల్లోడి గెడ్డలోకి ఫార్మా వ్యర్థ జలాలు!

- రాంకీ యాజమాన్యం గుట్టుగా విడిచి పెట్టినట్టు ఆరోపణలు
- దుర్వాసనతో స్థానికుల అవస్థలు
- చర్యలకు పలువురు డిమాండ్

పరవాడ, మే 18 (ఆంధ్రజ్యోతి) : మండల కేం ద్రం పరవాడ నుంచి భరణికం వెళ్లే రహదారిలోని మల్లోడి గెడ్డవాగు ఆదివారం సాయంత్రం ఫార్మా వ్యర్థ జలాలతో నిండిపోయింది. నీరంతా నల్లగా మారి వాగు పొడువున పారుతుంది. రాంకీకి చెం దిన సీఈపీటీ నుంచి వ్యర్థ రసాయనాలను శుద్ధి చేయకుండా నేరుగా విడిచిపెట్టడంతో అది నేరుగా పరవాడ ఊరచెరువు పక్కనున్న గెడ్డవాగు నుంచి దిగువభాగంలో ఉన్న మల్లోడి గెడ్డలో కలుస్తుందని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ కారణంగా భరించలేని దుర్వాసన వెదజల్లుతోందని అంటున్నారు. అటుగా రాకపోకలు సాగించేవారు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గతఏడాది కూడా ఫార్మా వ్యర్థ జలాలను మల్లోడి గెడ్డలోకి విడిచిపెట్టడంతో స్థానికులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన ఆదేశాల మేరకు రాంకీ యాజమాన్యం గెడ్డలో ఉన్న వ్యర్థజలాలను ట్యాంకర్లతో తరలించింది. ఫలితంగా గెడ్డ పూర్తిగా ఆరిపోయింది. ఇదిలావుంటే, రాంకీ యాజమాన్యం గుట్టుచప్పుడు కాకుండా శుద్ధి చేయని వ్యర్థ జలాలను విడిచిపెట్టడంతో కథ మొదటికే వచ్చిందని అంటున్నారు. ప్రజలకు హాని కలిగించే వ్యర్థ జలాలను బహిరంగ ప్రదేశాల్లోకి విడిచిపెట్టడం ఏమిటని స్థానికులు మండిపడుతున్నారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు తక్షణమే స్పందించి రాంకీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. వ్యర్థ జలాలు విడిచిపెట్టడం వల్ల భూగర్భజలాలు కలుషితం అవుతున్నాయని





మల్లోడి గెడ్డలోకి ప్రవహిస్తున్న ఫార్మా రసాయనాల వ్యర్థ జలాలు

ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫార్మా వ్యర్థ జలాలను శుద్ధి చేయకుండా నిబంధనలకు విరుద్ధంగా మల్లోడి గెడ్డలోకి విడిచిపెట్టడం దారుణమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ అన్నారు. ఈ విషయాన్ని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు రాంకీ యాజమాన్యానికి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ కారణంగానే యాజమాన్యంపై చర్యలు తీసుకునేందుకు వెనుకాడుతున్నారని విమర్శించారు. ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్న రాంకీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని గనిశెట్టి డిమాండ్ చేశారు.

నూకాంబిక ఆలయం భక్తులతో కిటకిట



బాలాలయంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

అనకాపల్లి టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత అనకాపల్లి నూకాంబిక ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి వేకువజాము నుంచే రాక ఆరంభం కావడంతో ఆలయ ప్రాంగణం, రహదారులు కోలాహలంగా మారాయి. తొలుత అర్చకులు బాలాలయంలోని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కుటుంబాలతో విచ్చేసినవారు ఆలయ ఆవరణతో పాటు చుట్టుపక్కల తోటల్లో వంటలు వండుకుని అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఈవో వెంపలి రాంబాబు, ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ పీలా నాగశ్రీను, సభ్యులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు. పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించగా, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా సీఐ ఎం.వెంకటనారాయణ చర్యలు చేపట్టారు.

మహిళల స్వయం ఉపాధికి కుట్టు శిక్షణ : కొణతాల



శిక్షణ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల

అనకాపల్లి టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి) : మహిళల స్వయం ఉపాధి పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా కుట్టు శిక్షణ కేంద్రాలను ప్రారంభించిందని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తెలిపారు. ఆదివారం సాయంత్రం అనకాపల్లి మండలం సీహెచ్ఎన్ అగ్రహారం, పట్టణంలోని కొట్నివీధి సచివాలయంలో ఉచిత కుట్టు శిక్షణ శిబిరాలను ప్రారంభించి మాట్లాడారు. మహిళల స్వయం ఉపాధి కోసమే ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు చెప్పారు. వీటిని అర్హులంతా సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. శిక్షణ అనంతరం ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు : ట్రాఫిక్ సీఐ

అనకాపల్లి టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ స్పష్టం చేశారు. ఇక్కడి కొబ్బరితోట జంక్షన్‌లో ఆటో డ్రైవర్లు, టాక్సీ డ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులకు ఆదివారం ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేస్తూ వాహనాలు నడపరాదన్నారు. ఆటో డ్రైవర్లు ముందు సీటులో ప్రయాణికులను కూర్చోబెట్టరాదని, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని సూచించారు. ద్విచక్ర వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాన్నారు. హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడపడం వల్ల జరిగే అనర్థాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

'అందరికీ అందుబాటులోకి బ్రహ్మ విద్య'



దేవీపురంలో శిక్షణ పూర్తి చేసుకున్న శ్రీవిద్యా ఉపాసకులు

సబ్బవరం, మే 18 (ఆంధ్రజ్యోతి) : బ్రహ్మ విద్యను అందరికీ అందుబాటులోకి తేవాలన్న సంకల్పంతో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు మండలంలోని దేవీపురంలో గల రాజరాజేశ్వరీ సహస్రాక్షి అమ్మవారి ఆలయ ప్రతినిధి, గురుపత్ని అన్నపూర్ణ తెలిపారు. శ్రీవిద్యా ట్రస్టు ఆధ్వర్యంలో శ్రీవిద్యా ఉపాసకలకు నిర్వహించిన మిడ్‌లెవెల్ కోర్సు శిక్షణ తరగతులు ఆదివారం ముగిసిన సందర్భంగా ఆమె మాట్లాడారు. కులమతాలకు అతీతంగా అందరికీ బ్రహ్మ విద్యను అందుబాటులోకి తేవాలన్న లక్ష్యంతో ఉన్నట్టు చెప్పారు. ఈ శిబిరానికి దేశవిదేశాల నుంచి హాజరయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు నిర్వాహకులు కందర్ప ప్రభాకర్, ఆచార్యులు రాధమూర్తి, కందర్ప రమా తదితరులు పాల్గొన్నారు.

లంకెలపాలెం పాఠశాలలో పూర్వ విద్యార్థుల సందడి



పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

లంకెలపాలెం, మే 18 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 79వ వార్డు పరిధి లంకెలపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో 2011-12 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న వారంతా సందడి చేశారు. దాదాపు దశాబ్దమున్నర అనంతరం కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేవు. తొలుత ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించుకున్నారు. మధ్యాహ్నం భోజనాల అనంతరం సాయంత్రం వరకు సరదాగా గడిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు కొండలరావు, రాజేశ్, కల్యాణి, మాణిక్యం, అప్పలరాజు, నిరజ, చంద్రశేఖర్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ మృతులకు స్మృత్యంజలి



వైద్యాలయం ఎదుట కొవ్వొత్తుల ప్రదర్శనలో వైద్యులు, సిబ్బంది

అనకాపల్లి టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ దీప స్మృత్యంజలి దినం సందర్భంగా ఎయిడ్స్ వల్ల ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మశాంతి కలగాలని ఆదివారం రాత్రి కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్ వైద్యాలయం నుంచి నెహ్రూచౌక్ వరకు కొవ్వొత్తులు చేతబట్టి ప్రదర్శనగా వెళ్లారు. ఈ సందర్భంగా ఎయిడ్స్, టీబీ కంట్రోల్ ఆఫీసర్ డాక్టర్ కె.బాలాజీ మాట్లాడుతూ ఏటా మే మూడవ ఆదివారం ప్రపంచ వ్యాప్తంగా ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్‌టీ సీనియర్ మెడికల్ ఆఫీసర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

84వ వార్డు టీడీపీ కమిటీ ఎన్నిక

అనకాపల్లి టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ 84వ వార్డు కమిటీ ఎన్నిక ఆదివారం ఇక్కడ మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. వార్డు అధ్యక్షుడిగా తలారి లక్ష్మీప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా సాలాపు మోహన్, ఉపాధ్యక్షుడిగా పిళ్లా తారకేసు, కార్యనిర్వాహక కార్యదర్శులుగా సూరారపు వెంకటగిరి, రేబాక ఈశ్వర అప్పారావు, కసిరెడ్డి అప్పలకొండ, కార్యదర్శులుగా నమ్మి రామారావు, పెనుమత్స సాయిరాజు, గ్రంధి వినయ్ కుమార్, మీడియా కో-ఆర్డినేటర్‌గా అలంక బోగేష్, కోశాధికారిగా గవర సురేష్ ఎన్నికయ్యారు. తెలుగు యువత అధ్యక్ష, కార్యదర్శులుగా మిర్తిపాటి మురళీ, మేడిశెట్టి సత్తిబాబు, మహిళా విభాగం అధ్యక్షురాలిగా నాగమణి, ప్రధాన కార్యదర్శిగా చెక్క లక్ష్మి, బీసీ సెల్ అధ్యక్షులుగా సూదికొండ రమణ, ప్రధాన కార్యదర్శిగా కాండ్రేగుల జగదీష్, మరో ఎనిమిది మందిని కార్యవర్గసభ్యులుగా ఎన్నుకున్నారు. పార్టీ రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు మాదంశెట్టి నీలబాబు అధ్యక్షతన జరిగిన ఈ ఎన్నికల్లో ఎన్నికల పర్యవేక్షకులు బొలిశెట్టి శ్రీనివాసరావు నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణం చేయించారు.



ప్రమాణం చేస్తున్న నూతన కమిటీ సభ్యులు, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే పీలా

ప్రణాళికతోనే పోటీ పరీక్షల్లో విజయం

- గౌరీ గ్రంథాలయం ఆధ్వర్యంలో ఏర్పాటైన అవగాహన సదస్సులో సీనియర్ న్యాయవాది రాజుగోపాల్



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న బీఎస్‌వీ రాజుగోపాల్

అనకాపల్లి టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి) : సామాజిక సేవ చేయాలన్న సంకల్పం ఉన్నవారు సివిల్స్, గ్రూప్-1 పరీక్షల్లో విజయం సాధించడం ద్వారా ఆ లక్ష్యాన్ని నెరవేర్చుకో వచ్చునని సీనియర్ న్యాయవాది బీఎస్‌వీ రాజుగోపాల్ అన్నారు. స్థానిక గౌరీ గ్రంథాలయం 83వ వార్షికోత్సవం సందర్భంగా వైజాగ్ ఐఏఎస్ అకాడమీ సహకారంతో సివిల్స్, గ్రూప్-1లపై శనివారం రాత్రి ఏర్పాటైన అవగాహన సదస్సులో ముఖ్య అతిథిగా మాట్లాడారు. లాజికల్ థింకింగ్, న్యూమరికల్ ఎబిలిటీ తదితర అంశాలపై పోటీ పరీక్షలకు హాజరు కానున్న అభ్యర్థులు నైపుణ్యం సాధించాలన్నారు. నిత్య అధ్యయనం, మాక్ టెస్టులు, సమయ పాలన విజయానికి కీలకంగా పేర్కొన్నారు. వైజాగ్ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ గౌతమ్ పోతల మాట్లాడుతూ స్టడీ గ్రూప్స్‌లో చేరడం వల్ల విద్యార్థుల ఆలోచనల మార్పిడి జరుగుతుందన్నారు. యూపీఎస్సీ విజేత డాక్టర్ రావాడ సాయి మోహిని మానస మాట్లాడుతూ ప్రణాళిక, పట్టుదల, సాధనతో సివిల్స్‌లో విజయం సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ, బోధకురాలు పి.గాయత్రి, గ్రంథాలయ అధ్యక్షుడు డి.నూకఅప్పారావు, నైన్‌మేన్ పవర్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో పి.రమేష్‌బాబు, సదస్సు సమన్వయకర్తలు మళ్ల బాపునాయుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్, గ్రంథాలయ ప్రతినిధులు కాండ్రేగుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభం పైనుంచి పడిన కార్మికుడి మృతి

కశింకోట, మే 18 (ఆంధ్రజ్యోతి) : ఓ కాంట్రాక్టు కార్మికుడు విశాఖలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ లక్ష్మణరావు తెలిపిన వివరాలివి. మాడుగుల మండలం వంటర్లపాలెం గ్రామానికి చెందిన సిహెచ్.శంకరరావు (45) ఏపీఈపీడీసీఎల్ పరిధిలో కాంట్రాక్టు కార్మికుడుగా పని చేస్తున్నాడు. ఏప్రిల్ 12న విధి నిర్వహణలో భాగంగా కశింకోట మండలం తేగాడ గ్రామంలో విద్యుత్ స్తంభం ఎక్కి పనిచేస్తుండగా షాక్ గురై కిందపడిపోయాడు. తీవ్ర గాయాలకు గురైన అతడు అప్పటి నుంచి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్టు అతని సోదరుడు సూరిబాబు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

- కుమారుడితో ద్విచక్ర వాహనంపై వెళుతుండగా ఘటన
- కార్పొరేటర్ శ్రీనివాస్ చూసి తన కారులో ఆసుపత్రికి తరలింపు



రమణమ్మను ఆసుపత్రికి తీసుకు వచ్చిన కార్పొరేటర్ శ్రీనివాస్

లంకెలపాలెం, మే 18 (ఆంధ్రజ్యోతి): కుమారుడితో కలిసి ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఓ మహిళ ప్రమాదవశాత్తు రోడ్డుపై పడి తీవ్ర గాయాలకు గురయ్యారు. పెద ముషిడివాడ శివారు పచ్చికోరువానిపాలెం వద్ద ఆది వారం ఈ ఘటన చోటుచేసుకొంది. సబ్బవరం మండలం మోపాడుపాలెం గ్రామానికి చెందిన రమణమ్మ తన కుమారుడు హేమంత్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై వెళుతున్నారు. సరిగ్గా పచ్చికోరువానిపాలెం మలుపు వద్దకు వచ్చేసరికి ఆమె కింద పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆ సమయంలో అటుగా వెళుతున్న జీవీఎంసీ 79వ కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ గుర్తించి వెంటనే ఆమెను తన కారులో ఎక్కించి అగనంపూడి ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులతో మాట్లాడి మెరుగైన సేవలందించారు.

అనుమానాస్పదంగా లారీ డ్రైవర్ మృతి

- విశాఖలో ఉంటున్న చిన్నారావు ట్యాంకర్ ద్వారా కాకినాడలో ఆయిల్ అన్‌లోడ్
- తిరుగు ప్రయాణంలో లంకెలపాలెం పెట్రోల్ బంకు వద్ద రాత్రి పార్కింగ్
- ఉదయం విగతజీవిగా మారడంతో పోలీసులు కేసు నమోదు



ట్యాంకర్ వద్ద మృతి చెంది ఉన్న డ్రైవర్ చిన్నారావు

లంకెలపాలెం, మే 18 (ఆంధ్రజ్యోతి) : అనుమానాస్పదంగా ఓ ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్ మృతి చెందాడు. జాతీయ రహదారి లంకెలపాలెం పెట్రోల్ బంకు వద్ద చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలివి. శ్రీకాకుళం జిల్లా జి.సిగడాం మండలం బాతువ ప్రాంతానికి చెందిన పాండ్రంగి చిన్నారావు (40) ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. విశాఖపట్నం వెంకోజీపాలెంలో కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నాడు. కాకినాడలో ఆయిల్ అన్‌లోడ్ చేసి బయల్దేరి, పరవాడ మండలం లంకెలపాలెం పెట్రోల్ బంకు వద్ద శనివారం రాత్రి వాహనాన్ని పార్కింగ్ చేశాడు. ఆది వారం ఉదయానికి అతడు తన ట్యాంకర్ వాహనం పక్కనే విగతజీవిగా పడి ఉన్నాడు. ఇది గుర్తించిన స్థానికులు పరవాడ పోలీసులకు సమాచారం అందిం చారు. వెంటనే వారు వచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. అయితే మృతదేహంపై ఎలాంటి గాయాలు లేవని, అనారోగ్యం కారణంగానే మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

కశింకోట, మే 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నర్సింగబిల్లి- బయ్యవరం రైల్వే స్టేషన్ మధ్య పట్టాలపై గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్టు తుని రైల్వే పోలీసులు ఆదివారం తెలిపారు. తుని నుంచి అనకాపల్లి వైపు వెళ్లే రైలు బండిలో ప్రయాణిస్తుండగా జారిపడి మృతి చెంది ఉంటాడని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కాగా మృతుడికి 30 ఏళ్ల వయస్సు ఉంటుందని, నీలం రంగు ఆఫ్ చేతుల టీషర్టు ధరించి ఉన్నాడని వివరించారు. టీ షర్టుపై ఓ సిమెంటు కంపెనీ పేరు రాసి ఉందని, నలుపు రంగు జీన్ ఫ్యాంటు ధరించి ఉన్నాడని పేర్కొన్నారు. ఇంతకు మించి మృతుడికి సంబంధించి ఎటువంటి ఆధారాలు లభించలేదన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి తుని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో మృతదేహాన్ని భద్రపరిచామని ఎస్ఐ జి.శ్రీనివాసరావు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 94906 19020 నంబరులో సంప్రదించాల్సిందిగా కోరారు.



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

22న అనకాపల్లిలో తిరంగా ర్యాలీ

- ప్రజలంతా తరలి రావాలి : సీఎం రమేశ్



కొత్తూరు, మే 18 (ఆంధ్రజ్యోతి) : ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా బీజేపీ దేశ వ్యాప్తంగా తిరంగా యాత్ర నిర్వహించనుందని అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. త్రివిధ దళాలతో పాటు ఇతర సాయుధ దళాల ధైర్య సాహసాలను అభినందిస్తూ, ప్రాణత్యాగం చేసిన సైనికుల గౌరవార్థం ఈ నెల 22న అనకాపల్లిలో ర్యాలీ చేపట్టనున్నట్టు వివరించారు. ఆ రోజు సాయం త్రం ఐదు గంటలకు పట్టణంలోని సన్‌క్యాస్టల్ హోటల్ నుంచి ర్యాలీ ప్రారంభమై నెహ్రూచౌక్ కూడలి వరకు సాగుతుందని పేర్కొన్నారు. అన్నివర్గాల ప్రజలు, విశ్రాంత ఆర్మీ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, కూటమి శ్రేణులు తరలి రావాల్సిందిగా ఆయన పిలుపునిచ్చారు.

నేత్రపర్వంగా వెంకన్న ఆలయంలో బ్రహ్మోత్సవాలు



పూజలందుకున్న శ్రీదేవి, భూదేవి సమేత వెంకన్న

పరవాడ, మే 18 (ఆంధ్రజ్యోతి) : ఈ.బోనంగి ఫార్మా పునరావాస కాలనీలోని కొండపై గల అభయ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవోపేతంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ప్రధానార్చకులు హరికృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో నాలుగో రోజైన ఆదివారం సుప్రభాత సేవ, జలాధివాస నిత్యహోమాలతో పాటు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాన్ని నిర్వహించారు. సాయంత్రం జరిగిన తిరువీధి ఉత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రెండు రోజులు నీటి సరఫరాకు అంతరాయం

లంకెలపాలెం, మే 18 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 79, 85 వార్డుల పరిధిలో సోమవారం నుంచి రెండు రోజుల పాటు నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని మంచినీటి విభాగం ఏఈ పి.కేదార్‌నాథ్ తెలిపారు. పినమడక వద్ద ప్రధాన పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో లంకెలపాలెం, మంత్రిపాలెం, గంజిపేట, గంగిరెడ్ల కాలనీ, శ్రీరామ్‌నగర్, వినాయక నగర్, హౌసింగ్ ప్రాంతాల్లో నీటి సరఫరాను నిలిపివేయనున్నామన్నారు. ట్యాంకర్ల ద్వారా ఆయా ప్రాంతాలకు తాగునీటిని సరఫరా చేస్తామని, ప్రజలు తమకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

చిన్నారి లోహిత కిడ్నాప్ కేసు చురుగ్గా విచారణ

అనకాపల్లి టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో కిడ్నాప్‌నకు గురైన చిన్నారి లోహిత కేసు విచారణను పోలీసులు చురుగ్గా చేపడుతున్నారు. ఎ-1, ఎ-3లు లక్ష్మి, ఆమె భర్త అప్పలస్వామిలను అరెస్టు చేసినట్టు శనివారం జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మీడియా సమావేశంలో ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఎ-2గా ఉన్న దేవి అనే మహిళను కూడా పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నట్టు సమాచారం. ఈమె నుంచి వివరాలు రాబట్టేందుకు కృషి చేస్తున్నారు.

రెండుచోట్ల చలివేంద్రాలు ఏర్పాటు

సబ్బవరం, మే 18 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం సబ్బవరం ఆర్టీసీ కాంప్లెక్స్, మొగలిపురం వద్ద ఆదివారం చలివేంద్రాలు ఏర్పాటయ్యాయి. తొలిరోజు ప్రయాణికులు, పాదచారులకు మజ్జిగను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, అంగటి నానాజీ, మాజీ సర్పంచ్ ధనిమిరెడ్డి శ్రీనివాసరావుతో పాటు పలువురు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీల విజేతలకు బహుమతులు

తుమ్మపాల, మే 18 (ఆంధ్రజ్యోతి) : గ్రీన్‌క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో విజేతలకు ఆదివారం బహుమతులను ప్రదానం చేశారు. నూకాంబిక దేవస్థానం ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ పీలా నాగశ్రీను చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. గ్రీన్‌క్లబ్ వ్యవస్థాపకులు కొణతాల ఫణిభూషణ్‌శ్రీధర్, కాండ్రేగుల వెంకటరమణ, సత్యనారాయణ, ఎన్.సత్తిబాబు, బీరా వినోద్‌కుమార్, రాపేటి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టీడీపీ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు బాబర్ జన్మదిన వేడుకలు



జన్మదిన కేక్ కట్ చేస్తున్న బాబర్

కశింకోట, మే 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బయ్యవరంలో టీడీపీ అనకాపల్లి జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఎస్.కె.రెహమాన్ (బాబర్) జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రాంకీ ఫోన్‌లో ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి గొంతిన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జన్మదిన కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఉగ్గిన రమణమూర్తి, వేగి గోపీకృష్ణ, సిదిరెడ్డి శ్రీనివాసరావు, పెంటకోట రాము, టీడీపీ గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శి మేడిశెట్టి నాగరామ అప్పారావు, కాలెపు ఈశ్వరరావు, సిహెచ్.ప్రసాద్, కరణం అప్పారావు, గడసాల శ్రీను, సిహెచ్.సూరిఅప్పారావు, సుంకర గోవింద, పార్టీ మండల అధ్యక్షురాలు శీరం వెంకటలక్ష్మి, నీటి సంఘం చైర్మన్ గూడెపు పద్మ తదితరులు పాల్గొన్నారు.